జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

సంపుటి 5 సంచిక 181 | హైదరాబాద్, ఏప్రిల్ 23 శనివారం 2022 | 8 పేజీలు | వెల : 5.00

విజయవాడ నగరంలో
రాఘవయ్య పార్క్ వద్ద గల
మన ఆఫీస్ లో
స్నేహ గ్రూప్ సభ్యులకు
సమావేశాలు
నిర్వహించుకునేందుకు
40 మంది వరకు
అవకాశం కల్పించబడును
వివరాలకు ఈ క్రింది నెంబర్లలో సంప్రదించగలరు
9000621111, 9440137451



# రెండేళ్ల ముందే ఎన్నికల వేడి..!

హైదరాబాద్, ఏప్రిల్ 22, :లోక్ సభ ఎన్నికలకు ఇంకా నిండా రెండేళ్ళ సమయముంది. ఏపీ అసెంబ్లీ ఎన్నికల కూడా లోక్ సభ ఎన్నికలతో పాటే జరుగుతాయి. సార్వత్రిక ఎన్నికలకు ఓ ఐదారు నెలల ముందు 2022 చివర్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. అయితే, ఉభయ తెలుగు రాష్ట్రలలో, ఇప్పటి నుంచే ఎన్నికల వేడి కాకరేపుతోంది. అలాగని ముందస్తు ఎన్నికలు ఏమైనా వస్తున్నాయా అంటే, అలాంటి అవకాశమే లేదని, అక్కడా, ఇక్కడా కూడా అధికార పార్టీ నాయకులు పదే పదేచెపుతూనే ఉన్నారు. తెలంగాణలో అయితే స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందస్తు ముచ్చటే లేదని ఒకటికి పదిసార్లు చెప్పుకొచ్చారు. అదే విషయం తెరాస ఉపాధ్యక్షుడు, మంత్రి కేటీఅర్ నిన్నటి వరంగల్ సభలో పునరుద్ఘాటించారు. అయినా, ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాత్రం ముందస్తు తథ్యం అంటున్నారు. ముఖ్యమంత్రి లేదన్నారంటే, ఉందని అర్థం చేసుకోవాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు అంటున్నారు. అయితే, ఇప్పటికిప్పుడు ఎన్నికలకు వెళ్ళినా అధికారం నిలబెట్టుకునే అవకాశమే లేనప్పుడు, ముందస్తుకు వెళ్లి ప్రయోజనం ఏమిటని తెరాసలో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ముందస్తు ఉన్న లేకున్నా ఎన్నికల వేదుని మాత్రం కొనసాగించాలని, అన్ని పార్టీలు, 'ఏకాభి ప్రాయం' కు వచ్చినట్లు కనిపిస్తోంది. అలాగే, ఏపీ ఆర్థిక పరిస్థితి, దినదిన ప్రవర్ధమానంగా దిగజరిపోతున్న నేపథ్యంలో రాష్ట్రంలో "శ్రీలంక తరహా సంక్షోభం"తలెత్తక ముందే ముందస్తుకు వెళ్లి అదృష్టం పరీక్షించుకోవాలని జగన్ రెడ్డి ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, "గోడ మీది రాత చాలా క్లియర్" గా వుంది. ముందస్తుకు వెళ్ళే సాహసం జగన్ రెడ్డి చేయరు" అని పార్టీ నాయకులే ప్రైవేటు టాక్'లో అంటున్నారు. అంటే, తెలంగాణలో తెరాసను ఏ విధంగా అయితే ఓటమి భయం వెంటాడు తోందో, అంతకు 10 రెట్ల భయం ఏపీలో వైసీపీని వెంటాడుతోంది. సో.. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం లేదని పరిశీలకులు అంటున్నారు. అయినా, ఉభయ రాష్ట్రాలలో అటు అధికార పార్టీలలో, ఇటు ప్రతిపక్షంలోనూ ఎన్నికల వేడి బుసలు కొడుతోంది. రేపో మాపో ఎన్నికలు ఖయాం అన్నట్లుగా ఎన్నికల ఉష్ణోగ్రతలు వేడెక్కుతున్నాయి. (మిగతా 2లో..)

# బోరిస్ పర్యటన చారిత్రాత్మకం

### భారత్-బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం..



ఢిల్లీ: భారత్, బ్రిటన్ దేశాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై (ఎఫ్‌టీఏ) పని చేస్తున్నాయని, ఈ ఏడాది చివరి నాటికి ఎఫ్‌టీఏను ముగించేందుకు కృషి చేయాలని నిర్ణయించుకున్నట్టు ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. మోడీ, బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ సమక్షంలో భారత్-యూకే మధ్య వివిధ ఒప్పందాలు జరిగాయి. రెండు రోజుల పర్యటన నిమిత్తం తొలిసారి ప్రధాని బోరిస్ భారత్‌కు వచ్చారు. రెండో పర్యటనలో భాగంగా.. శుక్రవారం ఉదయం ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు ప్రధానులు సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా ప్రధాని బోరిస్ భారత్ పర్యటన చారిత్రాత్మకమని ప్రధాని మోడీ కొనియాడారు. బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌తో రక్షణ రంగం, వాణిజ్యం, వాతావరణం, ఇంధన భద్రతపై చర్చలు జరిగాయని మోడీ తెలిపారు. అదేవిధంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భద్రతా పరంగా సహకారాన్ని అందిపుచ్చుకోవడంపై కూడా చర్చించినట్టు మోడీ పేర్కొన్నారు. గతేడాది భారత్-యూకే మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రారంభించామని తెలిపిన ప్రధాని మోడీ.. ఎఫ్‌టీఏకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

**జీఐ ట్యాగ్‌పై చర్చ**

బోరిస్ జాన్సన్‌తో భారత్ విదేశాంగ మంత్రి (మిగతా 3లో..)

# రష్యాపై ఆధారపడొద్దు, ఏ సాయమైనా చేస్తాం.. ఇండియాకు అమెరికా ఆఫర్



ఢిల్లీ: యుద్ధకాంక్షతో విర్రవీగుతున్న రష్యాపై ఆధారపడడం తగ్గించుకోవాలని, ఇండియాకు ఆయుధాలు సహా ఎటువంటి సహాయం కావాలన్నా అందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అమెరికా ప్రకటించింది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం చేస్తున్న నేపథ్యంలో ఇండియా తటస్థవైఖరిని అవలబిస్తున్న విషయం తెలిసిందే. అమెరికా, ఐరోపా దేశాల ఆంక్షలను కాదని రష్యానుంచి చమురు, ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో ఇన్నాళ్లూ తప్పుపట్టిన అగ్రదేశం ఇప్పుడు ఓ తరుణోపాయం ప్రకటించింది. సుదీర్ఘ మైత్రి, ఆయుధ ఒప్పందాల నేపథ్యంలో ఇంతకాలం రష్యాపై అతిగా ఆధాపడుతున్న ఇండియా ఇక వైఖరిని మార్చుకోవాలని, ఆ దేశంపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని, ఆ మేరకు ఏ సహాయమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నామని అమెరికా రక్షణశాఖ సహాయ మంత్రి వెండీ షెర్మన్ అన్నారు. భవిష్యత్‌లో రష్యా ఆయుధాలు ఎందుకూ పనికిరావని, ఆంక్షల ప్రభావంతో రష్యా ఆయుధ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని, అందువల్ల ఇండియా పునరాలోచించుకోవాలని ఆమె సూచించారు. ఈ విషయంలో తాము భారత్‌తో కలసి పనిచేసేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. ఐరోపా యూనియన్‌కు చెందిన ఫ్రెండ్స్ ఆఫా యూరోప్ సంస్థ బ్రసెల్స్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె ఈ కీలక ప్రకటన చేశారు. మరోవైపు ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాకు వస్తుసామాగ్రి, ఆయుధ సహాయం చేస్తున్న చైనాపై నిప్పులు కక్కారు. రష్యాకు అనుకూలంగా అబద్ధాలను ప్రచారం చేస్తూ పరోక్షంగా ఉక్రెయిన్ యుద్ధంలో ఆజ్యం పోస్తోందని విమర్శించారు. చైనా ఎన్ని కుయుక్తులు పన్నినా సంకీర్ణ పక్షాలను తమకు దూరం చేయలేదని ధీమా వ్యక్తం చేశారు. రష్యాకు అనుకూలంగా వ్యవహరిస్తున్న చైనాకు గుణపాఠాలు తప్పవని హెచ్చరించారు. ఆ దేశంపై ఆంక్షలు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఆమె వెల్లడించారు. రష్యాతో వ్యూహాత్మక సంబంధాలు బలోపేతం చేసుకుంటున్నామని బీజింగ్ ప్రకటించిన నేపథ్యంలో అమెరికా ఈ వ్యాఖ్యలు చేసింది. (మిగతా 3లో..)

## రాష్ట్రంలో నాలుగు రోజులపాటు వానలు

హైదరాబాద్: గత కొన్ని రోజులుగా భాణుడి ప్రతాపం, వేడి గాలులు, ఉక్కబోతతో సతమతమవుతున్న ప్రజలకు హైదరాబాద్ వాతావరణ శాఖ శుభవార్త అందించింది. రాష్ట్రంలో మరో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కర్ణాటక, తెలంగాణ మీదుగా ఉపరితల ద్రోణి ఆవరించి ఉందని, ఈ నెల 25 వరకు దాని ప్రభావం రాష్ట్రంపై ఉంటుందని వెల్లడించింది. దీంతో రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసిన విషయం తెలిసిందే. నగర వ్యాప్తంగా వాన కురిది. ఇప్పటికే నగరం మొత్తం మేఘావృతమై ఉన్నది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

# ఎన్‌పీఏ ప్రభుత్వానికి సిగ్గుచేటు..!

### కేంద్రంపై కేటీఆర్ ఫైర్..



హైదరాబాద్ : మోదీ నేతృత్వంలోని కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కారుపై రాష్ట్ర మున్సిపల్, ఐటీ పరిశ్రమల మంత్రి కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. గుజరాత్‌లో లోకోమోటివ్ కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ట్విటర్ వేదికగా కేటీఆర్ సెటైర్లు వేశారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటును 'మోడెమోక్రసీ' అంటూ ఎద్దేవా చేశారు. గుజరాత్‌కు చెందిన, గుజరాత్ చేత, గుజరాత్ కోసం పని చేస్తున్నారని ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు హామీని విస్మరించారన్న కేటీఆర్.. ఎన్‌పీఏ ప్రభుత్వానికి సిగ్గు చేటని మండిపడ్డారు. వరంగల్‌కు కేంద్రం ప్రకటించిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇప్పటికీ రాకపోగా.. గుజరాత్‌కు మాత్రం ఎలక్ట్రిక్ లోకోమోటివ్ ఇంజిన్ ప్రాజెక్టును ప్రకటిస్తూ కేంద్రం ఇటీవలే కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. దీనిపై రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు ట్విట్టర్ వేదికగా ఓ పోస్ట్ పెట్టగా.. కేటీఆర్ స్పందించారు.

## ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక కమిటీ సమావేశం



హైదరాబాద్: యాసంగి వడ్లను కొనేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను చేపట్టేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు ఏర్పాటైన ప్రత్యేక కమిటీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ నేతృత్వంలో శుక్రవారం సమావేశమైంది. బీఆర్కేఆర్ లో జరిగిన ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, పౌర సరఫరాల శాఖ కమీషనర్ అనీల్ కుమార్ లు పాల్గొన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ళు, ఎఫ్.సి.ఐ కి అందించే ధాన్యం తదితర అంశాలను ఈ సమావేశంలో చర్చించారు.

# ప్రేమించట్లేదని యువతి గొంతు కోసిన ఉన్మాది



హనుమకొండ : తనను ప్రేమించట్లేదనే కోపంతో ఓ యువకుడు దారుణానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటన హనుమకొండలోని సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. నర్సంపేట పరిధిలోని లక్నెపల్లి గ్రామానికి చెందిన అనూష(23) కాకతీయ యూనివర్సిటీలో ఎంసీఏ ఫైనలియర్ చదువుతోంది. చదువు రీత్యా అనూషతో పాటు ఆమె కుటుంబ సభ్యులు పోచమ్మ గుడి సమీపంలోని గాంధీ నగర్‌లో నివాసముంటున్నారు. అయితే తనను ప్రేమించాలని అజహర్ అనే యువకుడు.. అనూషను గత కొంతకాలం నుంచి వేధింపులకు గురి చేస్తున్నాడు. అనూషనేమో అజహర్ ప్రతిపాదనను తిరస్కరిస్తూ వస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం గాంధీ నగర్ చేరుకున్న అజహర్.. ఇంట్లో అనూష ఒక్కరే ఉన్నట్లు నిర్ధారించుకున్నాడు. దీంతో ఇంట్లోకి ప్రవేశించిన అజహర్.. తనను ప్రేమించాలని పట్టుబట్టాడు. ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. తన వెంట తెచ్చుకున్న కత్తితో అనూష గొంతును కోసి పరారీ అయ్యాడు.

అనూషను చూసి తల్లి షాక్..

అప్పుడే ఇంటికి వచ్చిన తల్లి.. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న అనూషను చూసి షాక్‌కు గురైంది. స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనూషకు వైద్యులు చికిత్స అందించారు.



జై భీమ్
పూలే, అంబేడ్కర్ చెప్పినట్లుగా అత్యధిక జనాభా ఉన్న మనం రాష్ట్రాన్ని పరిపాలించాలి.
గడచిన 74 సంవత్సరాలు పాలకులు మనల్ని రిప్రజెంటేషన్ల ద్వారా అడుక్కునేటట్లు చేశారు.
ఈ సంప్రదాయానికి చరమగీతం పాడి, మన రాష్ట్రాన్ని మనమే పాలించే విధంగా తయారవ్వాలి.
మన ఏకైక లక్ష్యం బహుజన రాజ్యాధికారం మాత్రమే కావాలి
పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి

# కరెంటు సమస్యలు పరిష్కరించాలి

## వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



వికారాబాద్ బ్యూరో 22 ఏప్రిల్ ప్రజాపాలన : కరెంటు సమస్యలను పరిష్కరించాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సూచించారు. శుక్రవారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ''మీతో నేను'' కార్యక్రమంలో భాగంగా ధారూర్ మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఉదయం 7 గంటల నుండి 11 వరకు పర్యటించారు. గ్రామంలో విద్యుత్ లైట్లకు థర్డ్ వైర్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఇండ్ల మధ్యలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ మరో చోటుకు మార్చాలని సూచించారు. కాలనీలో స్థంభాలు ఉండి విద్యుత్ వైర్లు లేనటువంటి స్థంభాలకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పంటపొలాల్లో మరియు గ్రామంలో వేలాడుతున్న తీగలను వెంటనే సరిచేయాలని వెల్లడించారు. గ్రామంలో విద్యుత్ సమస్యలు లేకుండా చేయాలన్నారు. ట్రాన్స్ఫార్మర్ లకు దిమ్మెలు కట్టి ఎత్తు పెంచాలని అధికారులును ఆదేశించారు. ధారూర్ మండలంలో మీతో నేను కార్యక్రమంలో భాగంగా పర్యటించిన గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో విద్యుత్ సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని ఆదేశించారు. గ్రామంలో గ్రామపంచాయతీ సిబ్బంది మురుగు కాలువలు తీస్తూ చెత్త సేకరణ చేయాలన్నారు. గ్రామపంచాయతీ భవనం నుండి మెయిన్ రోడ్డు వరకు నూతనంగా రోడ్డు నిర్మాణానికి కృషి చేద్దాం అన్నారు. ఎంజిఎన్ఆర్ఈజిఎస్ లో నిర్మించిన మేకల షెడ్డులకు బిల్లులు రావడంలేదని ప్రజలు ఎమ్మెల్యేకు తెలుపగా వెంటనే బిల్లులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని బోర్ నీటిని పరీక్షించి ఫ్లోరైడ్ మోతాదును పరిశీలించాలని సూచించారు. హ్యాండ్ పంపులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ కు మరమ్మతులు చేసి, ప్రతి వార్డులో ఇంటింటికి నీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ మన ఊరు మన బడి కార్యక్రమం తీసుకొచ్చారని అందులో రుద్రారం పాఠశాల ఎంపిక కావడం జరిగిందని చెప్పారు. వచ్చే సంవత్సరం నుండి ఆంగ్లంలో విద్యాభ్యాసం ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇళ్లు కూల్చివేత



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 21 ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలో ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్ ఆరో వార్డు 300 గల సర్వే నంబర్ ఇండ్లు నిర్మాణాన్ని ప్రభుత్వ అధికారులు అక్రమంగా కట్టారని కూల్చివేయడం జరిగింది ఇట్టి సర్వేనెంబర్ లో ఒకవైపు ప్రభుత్వం 50 గజాల లో ఉన్నవారికి ఇల్లు నిర్మించుకోవచ్చు ప్రభుత్వం ఒక వైపు చెబుతుంటే అధికారులు మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. డబ్బులు ఉన్నా బడాబాబుల జోలికి వెళ్లకుండా అక్రమ నిర్మాణాలు అక్రమ వెంచర్లు చేస్తుంటే చూస్తూ ఊరుకున్న అధికారులు మాలాంటి నీడ లేని పేదలు ఇల్లు నిర్మాణం చేస్తుంటే కూల్చివేశారు . భాదితులు బోరున విలపించిన కనికరించని అధికారులు ! రోజువారి కూలి చేస్తూ జీవనం కొనసాగిస్తున్నా పేదల ఇండ్లను కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని ఆయన అన్నారు. బాధితులు అడగ్గా వారి గోడు పట్టించుకోకుండా అక్రమంగా కట్టారన్న నెపంతో వాళ్ళ కళ్ళ ఎదుట నే కూల్చడం బోరున విలపించి దేవుడా ఆదుకునే దిక్కు లేదా అంటూ దుఃఖిస్తున్నారు ఈ సంఘటన తెలిసి తెలువగానే 8వ వార్డు కౌన్సిలర్ గోపాగళ్ళ మహేందర్ మాజీ వార్డు మెంబర్ కాకి రవీందర్ చేరుకొని అధికారులను నిలదీయగా ప్రభుత్వ అధికారులు మాకు ఆర్డర్ ప్రకారం గా చేస్తామని ఆయన తెలపగా పై అధికారులకు ఫోన్ చేసి పేదలకు న్యాయం చేయాలని అధికారులు ను కోరగా వెంబడే తిరిగి అధికారులు వెళ్లిపోయారు బాధితులకు న్యాయం చేసే విధంగా అండగా ఉండి అధికారులతో దృష్టికి తీసుకెళ్లి మాట్లాడి ఇల్లు నిర్మాణం చేసే దిశగా చేస్తామని బాధితులకు స్థానికులు హామీ ఇచ్చారు.

# మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మైండ్ స్పార్క్ ఈవెంట్



హైదరాబాద్ 21 ఎప్రిల్ ప్రజాపాలన: ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐ.ఎస్.టి.ఇ.) స్టూడెంట్ చాప్టర్ ఆద్వర్యంలో మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ లో మైండ్ స్పార్క్ ఈవెంట్ నిర్వహించారు.మేడ్చల్ మండలం మైసమ్మ గూడ లోని మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (ఎం.ఆర్.ఐ.టి.ఎస్.)కాలేజీ లో ప్రిన్సిపల్ డాక్టర్.రవీంద్ర ఆద్వర్యంలో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్టూడెంట్ చాప్టర్ కింద 'మైండ్ స్పార్క్' పేరుతో ఏప్రిల్ 20 మరియు 21 తేదీలో రెండు రోజుల పాటు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లోని వివిధ విభాగాల విద్యార్థులు వారి అధ్యాపకుల సమక్షంలో పాల్గొని వారి ప్రతిభను చాటుకున్నారు.ఫాకల్టీ అడ్వైజర్ డాక్టర్.ఎన్.వినయ్ కుమారి పర్యవేక్షణలో మైండ్ స్పార్క్ ఈవెంట్ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఇలాంటి ఈవెంట్స్ ద్వారా విద్యార్థుల ప్రతిభ ను వెలుగులోకి తీసుకు వచ్చారు. తల్లిదండ్రులకు ఈవెంట్స్ వివరాలను వాట్సాప్ ద్వారా పంపించారు. రెండు రోజుల ప్రదర్శన పూర్తి అయిన పిదప 'మైండ్ స్పార్క్' ఈవెంట్ లో పాల్గొన్న విద్యార్థులకు చివరి రోజున సర్టిఫికెట్లు అందజేశారు.

# జిల్లాలో సమృద్ధిగా భూగర్భ జలాల లభ్యత

## జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి



మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 22, ప్రజాపాలన:జిల్లాలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయని, వ్యవసాయ, గృహ, ఇతరత్రా అవసరాలకు పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2019-22 భూగర్భ జలాల నివేదికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జల లభ్యత 67 వేల 724 హెక్టామీటర్లు ఉండగా అన్ని రకాల అవసరాలకు 27 శాతంతో 18 వేల 28 హెక్టామీటర్లు మాత్రమే వినియోగిస్తున్నారని, 47 వేల 834 హెక్టామీటర్ల మిగులు జలాలు ఉన్నాయని తెలిపారు. కమాండ్ ఏరియాలో 20 శాతం, నాన్ కమాండ్ ఏరియాలో 31 శాతంగా వినియోగం ఉందని, జిల్లాలో 18 మండలాలను 7 మైక్రోబేసిన్స్ గా విభజించగా సేఫ్ కేటగిరిలో ఉన్నాయని, చెన్నూర్, జైపూర్లను సెమీ క్రిటికల్ మండలాలుగా గుర్తించడం జరిగిందని, బేసిన్స్ వారిగా మిగిలిన 16 మండలాలు సేఫ్ గా ఉన్నాయని, జిల్లాలో 4 వేల 16 చదరపు కిలోమీటర్లకు గాను 27 శాతం భూగర్భ జల వినియోగం జరుగుతుందని తెలిపారు. 2019-20 అంచనా 95 వేల 121 హెక్టార్లకు గాను 81 వేల 201 హెక్టార్లు వినియోగంలోకి తీసుకురావచ్చని తెలిపారు. పంటల సాగు కొరకు పొదుపుగా వాడుతూ 20 వేల నుండి 40 వేల బోర్ల వరకు వేసుకోవచ్చని అంచనా వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూగర్భ జల శాఖ ఉప సంచాలకులు పి. శ్రీనివాస్ బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రాజకీయ పార్టీలు బిసి డిక్లరేషన్ ప్రకటించాలి

## గంగపుత్ర సంఘం పట్టణ అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్



మంచిర్యాల బ్యూరో , ఎప్రిల్22 ,ప్రజాపాలన :రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బిసి డిక్లరేషన్ ప్రకటించి ఎన్నికలకు రావాలని గంగపుత్ర సంఘం పట్టణ అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గోని మాట్లాడారు.గురువారం బహుజన రాజ్యాధికార పాదయాత్రలో బిఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త ఆర్ఎస్ ప్రవీణ్ బీసీల కు 70 అసెంబ్లీ సీట్లు కేటాయిస్తామని ప్రకటించడం జరిగింది పేర్కొన్నారు. దీన్ని బీసీ సంఘంగా స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో ఉన్న టి.ఆర్.ఎస్ కాంగ్రెస్ బిజెపి తదితర పార్టీలు కూడా బీసీ జనాభా దామాషా ప్రకారం అసెంబ్లీ సీట్లు కేటాయించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.75 ఏళ్ల ప్రజాస్వామ్య దేశమని గొప్పగా చెప్పుకుంటున్న నేపథ్యంలో దేశ జనాభాలో 10 శాతం ఉన్న అగ్రవర్ణ , అగ్రవర్ణ కులాలకు చెందిన వారు 75 సంవత్సరాలుగా దేశాన్ని, రాష్ట్రం ను పాలిస్తున్నారని అన్నారు. దేశ జనాభాలో 60 శాతం, రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలు రాజ్యాధికారంలో వెనకబడి ఉన్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో , మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు జైపాల్ సింగ్, బీసీ నాయకుడు మామిడాల ప్రకాష్, కోత్తకొండ రమేష్, జంబోజు శ్రీనివాస్, కల్వచర్ల నాగభూషణం చారి, శెట్టిపల్లి గట్టయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 22 ప్రజాపాలన ప్రతినిధి. :ఈ కార్యక్రమం బిజెపి మున్సిపల్ అధ్యక్షులు బూడిద నరసింహారెడ్డి దండే శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో చేయడం జరిగింది ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పైన పైన అనుచిత వ్యాఖ్యలు చేయడం జరిగింది పిచ్చి పిచ్చి గా మాట్లాడ%శీ% జరిగింది.బిజెపి మహాసంగ్రామం యాత్ర ను చూసి కేటీఆర్ ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడడం జరిగింది.చిల్లర రాజకీయాలు చేస్తునరని అసెంబ్లీ కన్వీనర్ నాయిని సత్యనారాయణ అన్నారు.ఈ కార్యక్రమంలోరాష్ట్ర నాయకులుఏన్ను యాదగిరి రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మోగిలిగణేష్ ,బాలేష్,కృష్ణ శేఖర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి బూత్ అధ్యక్షులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# రెండేళ్ల ముందే ఎన్నికల వేడి..!

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్ర ప్రదేశ్'లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ప్యాలెస్ గడపదాటి బయటకు వస్తున్నారు. ఇంచుమించుగా రెండేళ్లకు పైగా ప్యాలెస్'కే పరిమితమైన ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. ఇంతవరకు, అద్దాల మేడలో కూర్చుని అంతా బాగుందనే భ్రమల్లో ఉన్న ముఖ్యమంత్రికి, మంత్రివర్గ విస్తరణ అనంతర పరిణామాలు వాస్తవ పరిస్థితి అర్థమయ్యేలా చేశాయని పార్టీ నాయకులు అంటున్నారు. అందుకే ప్రస్తుతం ముఖ్యమంత్రి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారని, ఇందులో భాగంగానే పార్టీ సంస్థాగత నిర్మాణం పై దృష్టి పెట్టారని అంటున్నారు. మంత్రి వర్గ పునర్ వ్యవస్థీకరణతో పాటుగా పార్టీ జిల్లాల అధ్యక్షులు, ప్రాంతీయ సమన్వయకర్తల నియామకాల చేపట్టారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ బలోపేతానికి ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే,జరగవలసిన నష్టం జరిగి పోయిన తర్వాత ముఖ్యమంత్రి ఇప్పుడు కళ్ళు తెరవడం వలన ప్రయోజనం ఉండదని, ఒక విధంగ ముఖ్యమంత్రి చేపట్టిన దిద్దుబాటు చర్యలు చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు ఉందని అంటున్నారు. అదలా వైసీపీ గడప గడపకు వైసీపీ కార్యక్రమం ప్రారంభించింది. ఇందలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులను ఆదేశించారు.మరోవంక ప్రధాన ప్రతిపక్షం టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కూడా,ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఆందోళనలు చేపడుతూనే, మరోవంక పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడు, ఇతర సీనియర్ నేతలు జిల్లాలలో పర్యటించేందుకు ప్రణాకలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. మే నెల నుంచి చంద్రబాబు జిల్లాల పర్యటనలు ఉంటాయని సమాచారం. విధ్యుత్, బస్సు చార్జీల పెంపుదలకు నిరసనగా టీడీపీ శ్రేణులు నిర్వహిస్తున్న బాదుడే బాదుడు ఆందోళన కార్యక్రమాల్లో చంద్రబాబు పాల్గొంటున్నారు. మే నెలలో నిర్వహించనున్న మహానాడు తర్వాత చంద్రబాబు జిల్లాల పర్యటనకు ప్లాన్ చేస్తున్నారు. ఇక, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర చేపట్టేందుకు సిద్ధమయ్యారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఏడాది పాటు ప్రజల్లో ఉండే విధంగా లోకేష్ యాత్రకు ప్లాన్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. మరోవంక టీడీపీ పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టింది. ఆలాగే జనసేన్ అధినేత పవన్ కళ్యాణ్ రైతుల ఆత్మహత్యలపై ఫోకస్ పెట్టారు. ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలను, పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. మరో వంక రాష్ట్ర ప్రజానీకంలో చైతన్యంతోపాటు వైసీపీ దురాగతాలను ఎండగట్టడానికి త్వరలో హైమాండ్ అనుమతితో రాష్ట్రంలో పాదయాత్ర నిర్వహిస్తామని పీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజానాథ్ వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగించి, ప్రజాధనాన్ని, ఆస్తులను దోచుకుంటున్న వారికి కంటికి మీద కునుకు లేకుండా చేస్తామని హెచ్చరించారు. సో ..ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎన్నికల వేడి పెరిగిపోతోంది. మరో వంక ఎన్నికలు జరిగే వరకు ఇదే వేడి కొనసాగుతుందని, పరిశీలకులు అంటున్నారు.

# రంజాన్ మాసం గిఫ్ట్ పాకెట్స్ పంపిణీ

## వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



వికారాబాద్ బ్యూరో 22 ఏప్రిల్ ప్రజా పాలన : ముస్లిం మైనార్టీ వర్గాలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకొనుటకు గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ చేశామని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం మైనార్టీలకు గిఫ్ట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలు వారికి సంబంధించిన పండుగలను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని గుర్తు చేశారు. కుటుంబ సభ్యులందరూ నూతన వస్త్రాలు ధరించి సామాజిక కట్టుబాట్లను అనుసరించాలని సూచించారు. పిల్లాపాపలతో కుటుంబ సభ్యులందరూ సంతోషంగా జీవించాలని కోరారు. రంజాన్ మాసం పవిత్రతను ప్రతి ముస్లిం ప్రత్యేక భక్తిప్రపత్తులతో అనుసరిస్తారని పేర్కొన్నారు. కఠోర ఉపవాస దీక్షతో అల్లాను తలుచుకుంటూ తమ జీవన యానం కొనసాగిస్తారని స్పష్టం చేశారు. వికారాబాద్ పట్టణ పరిధిలో 550 గ్రామీణ ప్రాంత 450 మై గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మొత్తం వికారాబాద్ నియోజకవర్గానికి 2500 గిఫ్ట్ పాకెట్లను పంపిణీ చేశారు. ఇఫ్తార్ విందు కొరకు రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల నిధులను కేటాయించిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మండల ఎమ్మార్వో షర్మిల మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం ముత్తహర్ షరీఫ్ ఎంపీపీ కామిడీ చంద్రకళ ఎంపీడీవో మల్లు సత్తయ్యరంజాన్ మాసం కమిటీ చైర్మన్ జైనొద్దీన్ మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ అఫ్జల్ షకీల్ వికారాబాద్ మండల కో ఆప్షన్ మెంబర్ ఎర్రవల్లి జాఫర్ మైనార్టీ నాయకులు తస్వర్ అలీ ఫక్రుద్దీన్ అబ్దుల్ బషీర్ మిర్జా ఫెరోజ్ బేగ్ ఎజాజ్ అఫ్రిది ముత్తహర్ షరీఫ్ గఫార్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి అడ్డుగా ఉన్న స్టాండ్ ను వెంటనే తొలగించాలి: కాంగ్రెస్ పార్టీ



మధిర ఏప్రిల్ 22 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు మండల పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలోకాంగ్రెస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి ప్రజల ఆరాధ్య దైవండాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డివిగ్రహం వైయస్సార్ చౌరస్తా లో విగ్రహానికి అడ్డంగా ట్రాఫిక్ పోలీస్ స్టాండ్ ఏర్పాటు చేయటం వలన విగ్రహం కనిపించటం లేదు.. దీనిపై ప్రజలు ఆగ్రహిస్తున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరం శెట్టి కిషోర్ వైఎస్ఆర్ విగ్రహంఉన్న ప్రాంతాన్ని సందర్శించి వెంటనే ఆ ప్రదేశం నుంచి స్టాండ్ ను తొలగించి వేరే చోట ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మధిర మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లిబాలరాజులి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లితూమాటి నవీన్ రెడ్డిలి పట్టణ పట్టణ ఐఎన్టియుసి అధ్యక్షుడు లిషేక్ బాజీలి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు లిషేక్ జహంగీర్లి డివిజన్ కమిటీ అధ్యక్షుడు లిబానోత్ రమణ నాయక్, తలపుల వెంకటేశ్వర్లులి మొదలగు వారు పాల్గొన్నారు.

# అరిగెల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఆసిఫాబాద్ ఏప్రిల్22, ప్రజాపాలన ప్రతినిధి: ఆసిఫాబాద్ జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్ లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు పవిత్ర మాసమని అన్నారు మైనారిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో కెరమెరి వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, టిఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్ బిన్ అబ్దుల్లా, సర్పంచులు భీమేశ్, శ్రీనివాస్, నాయకులు కోవా సాయినాథ్, అబ్దుల్లా, సాబీర్, అమర్, నజీర్, ముశీర్, శ్రీశైలం, రామగౌడ్ పాల్గొన్నారు.

# రిలయన్స్ జియో యూజర్లు షాక్

ముంబై ఏప్రిల్ 22, :రిలయన్స్ జియోకు యూజర్లు షాకిస్తున్నారు. ఫిబ్రవరి నెలలో జియో భారీగా యూజర్లను కోల్పోయింది. జియోకు 36 లక్షల వరకు కస్టమర్ల సంఖ్య తగ్గిపోయింది. జియో నే కాకుండా వొడాఫోన్ ఐడియా కూడా భారీగా కస్టమర్లను కోల్పోయింది. ఈ కంపెనీ దాదాపు 15 లక్షల వరకు కస్టమర్లను కోల్పోయింది. టారిఫ్ ధరల పెంపే ఇందుకు కారణంగా తెలుస్తోంది. జియో, వొడాఫోన్ ఐడియాలకు కస్టమర్ల సంఖ్య తగ్గడం ఇది మూడో నెల. ఇందుకు ఫిబ్రవరికి సంబంధించిన టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా వివరాలను వెల్లడించింది. దేశంలో అతిపెద్ద టెలికం కంపెనీ జియో సబ్‌స్క్రైబర్‌ల సంఖ్య 40.2 కోట్లుగా ఉంది.అలాగే వొడాఫోన్ ఐడియా సబ్‌స్క్రైబర్‌ల సంఖ్య 26.45 కోట్లుగా ఉంది. జనవరి నెలలో జియో 93 లక్షలు, వొడాఫోన్ ఐడియా 3 లక్షల చొప్పున కస్టమర్లు తగ్గిపోయారు. అయితే టెలికం కంపెనీలు నవంబర్ చివరి నాటికి ప్రీపెయిడ్ ప్లాన్‌లలో 20 శాతం సుంకాన్ని పెంచాయి. రెండో సిమ్ కార్డును రీచార్జ్ చేసుకోవడం తగ్గించారని టెలికం నిపుణులు చెబుతున్నారు.ఇక డిసెంబర్‌లో కూడా ఇదే ట్రెండ్ కొనసాగింది. జియో 1.3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్‌లను కోల్పోయింది. ఇక ఎయిర్‌టెల్ మాత్రం దూసుకుపోయింది. ఫిబ్రవరి నెలలో 16 లక్షల మేర యూజర్లను పెంచుకున్నట్లు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నివేదికలో వెల్లడైంది. ఇక ఫిబ్రవరి చివరి నాటికి ఎయిర్‌టెల్ కస్టమర్ల సంఖ్య 35.8 కోట్లుగా ఉంది. ఇక నెలవారీ ప్రాతిపదికన చూస్తే మొత్తంగా దేశంలో సబ్‌స్క్రైబర్ల సంఖ్య 37 లక్షల మేర తగ్గింది. 114.5 కోట్ల నుంచి 114.41 కోట్లకు క్షీణించింది. మార్చి నెలలో కూడా ఇదే తీరు కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

## ఎగుమతులను పెంచడానికి వాటాదారుల ఔట్రీచ్ కార్యక్రమానికి నగరం ఆతిథ్యం

హైదరాబాద్: భారతదేశం-యుఎఇ సమగ్ర, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సిఇపిఎ), ఇండియా-ఆస్ట్రేలియా ఆర్థిక సహకారం, వాణిజ్య ఒప్పందం (ఇసిటిఎ)పై వాటాదారుల ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ వాణిజ్య విభాగం ఏప్రిల్ 23న హైదరాబాద్ నగరంలో నిర్వహిస్తోంది.



ఎగుమతులపై రాష్ట్రానికి చెందిన పరిశ్రమ వర్గాలు, ఎగుమతిదారులకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో . తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ, ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్ ), భారత ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతుల ప్రోత్సాహ మండలి వంటి ఎగుమతుల ప్రోత్సాహక మండళ్లు, రత్నాలు ఆభరణాల ఎగుమతి ప్రోత్సాహ మండలి (ఇపిసిలు) , భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) లాంటి పరిశ్రమ సమాఖ్య సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఔట్రీచ్ కార్యక్రమం వల్ల తెలంగాణ రాష్ట్రానికి చెందిన సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) ఒప్పందాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుంది. యుఎఇ, ఆస్ట్రేలియా దేశాలకు వస్తువులు, సేవల ఎగుమతులపై కుదిరిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలతో భారతదేశం అత్యధిక ఎఫ్టీఏ రాయితీలు, ఒప్పందాలను పొందింది. ఈ ఒప్పందాల వల్ల అందుబాటులోకి వచ్చే వ్యాపార, వాణిజ్య అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రయోజనాలు పొందేందుకు ఎగుమతిదారులకు ఔట్రీచ్ కార్యక్రమం సహాయ పడుతుంది. దీనివల్ల ఈ రెండు దేశాలకు భారతదేశం నుంచి జరుగుతున్న ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయి. ఎగుమతులు పెరగడం వల్ల లక్షలాది కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దీనితో దేశ ప్రజలకు సంక్షేమ ఫలాలు మరింత గా అందుబాటులోకి వస్తాయి.

# నేతల మధ్య మాటల మంటలు

హైదరాబాద్, ఏప్రిల్ 22, :తెలంగాణలో నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. పరస్పర విమర్శలతో రాజకీయ తాళింపు కుతకుతలాడుతోంది. విమర్శలు విమర్శలుగా కాకుండా అసభ్యపదజాలం ఉపయోగిస్తుండటం ఇప్పుడు చర్చకు తావిస్తోంది. గతంలో సీఎం కేసీఆర్‌పై ప్రతిపక్షాలు అనరాని మాటలు అంటున్నాయని టీఆర్ఎస్ నేతలు భగ్గుమన్న సంగతి రాష్ట్ర ప్రజలకు తెలిసిందే. అయితే, తాజాగా హన్మకొండలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్ ప్రతిపక్షాలను దూషించిన తీరు అందరినీ ముక్కున వేలేసుకునేలా చేసింది.తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ క్రమంలో మంత్రి ఉపయోగించిన పదాలు తెలంగాణ రాజకీయ చదరంగంలో మరోసారి రచ్చరేపాయి. నువ్వు ఒకటి అంటే నేను రెండు అని చూపిస్తా అన్నట్లుగా మారింది స్టేట్ పొలిటికల్ లీడర్ల పరిస్థితి. గతంలో సీఎం కేసీఆర్ ఇదే తరహా వ్యాఖ్యలు చేయడంతో ప్రతిపక్షాలు సైతం అదే భాష తీరు అనుసరించిన సందర్భాలు ఉన్నాయి. ఆ తర్వాత రాజకీయ విమర్శల్లో జుగుప్సాకత పెరిగిపోయింది. చివరకు అది నేతల మధ్య బాడీ షేమింగ్ వరకూ చేరుకుంది. ఒక దశలో మంత్రి కేటీఆర్ కుటుంబ సభ్యులను సైతం రాజకీయాల్లోకి లాగడంతో పెద్ద దుమారమే రేగింది. ఆ తర్వాత కొంత కాలం కాస్త మెరుగుపడిందనుకున్న నేతల భాష మరోసారి జడలు విప్పుకుంది. కేటీఆర్ చేసిన ప్రసంగంలో బీజేపీ నేతలతో పాటు కాంగ్రెస్ నేతలపై విరుచుకుపడిన తీరు అందరినీ అవాక్కయ్యేలా చేసింది. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కేటీఆర్ విమర్శలు విమర్శల వరకు బాగానే ఉన్నా ఆయన వాడిన భాష మాత్రం సరికాదనే విమర్శలు వస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని తాము కూడా మోడీని నోటికి వచ్చినట్లు తిట్టగలం కానీ, తిట్టడానికి సంస్కారం అడ్డు వస్తుంది అంటూనే అనాల్సిన మాటలు అనేశాడనేది పొలిటికల్ కారిడార్‌లో జరుగుతోన్న ప్రచారం. ఇదే సభలో కేటీఆర్ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అరవింద్‌లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాడీ షేమింగ్ కిందకు రావా అని ప్రశ్నిస్తున్నారు ప్రజలు. గతంలో కేటీఆర్ కుమారుడిపై ఎలాంటి వ్యాఖ్యలు సరి కాదని చెప్పారో ఇప్పుడు అలాంటి వ్యాఖ్యలే నాయకులను ఉద్దేశించి కేటీఆర్ చేయడం హాట్ టాపిక్ అవుతోందిమంత్రి కేటీఆర్ హన్మకొండలో చేసిన విమర్శలపై గురువారం బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ కౌంటర్ ఇచ్చాడు. నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించిన ఆయన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ గతంలో ఉపయోగించిన పదజాలాన్ని వీడియో రూపంలో చూపించాడు. అంతటితో ఆగకుండా మంత్రి వాడిన భాషకు ఏ మాత్రం తగ్గకుండా కామెంట్లు చేశాడు. దీంతో ఇరు పార్టీల నేతల మధ్య భాషా సంస్కారంపై మాటల ఫిరంగులు పేలుతున్నాయి. ఇక టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి సైతం అంతే అగ్రెసివ్‌గా ముందుకు వెళ్తున్నారు. సందర్భం వచ్చినప్పుడల్లా ప్రభుత్వపెద్దలపై ఓ రేంజ్‌లో పరుషపదాలతో విమర్శిస్తూ వస్తున్నారు. సీఎం కేసీఆర్‌ను టార్గెట్‌గా చేసుకుని గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలు అగ్గిరాజేశాయి.రాజకీయ నాయకులు ఏది చేసినా వాటి వెనుక ఏదో పరమార్థం దాగి ఉంటుంది. తెలంగాణలో నేతలు అల్లుతున్న తిట్ల పురాణం రాబోయే రోజుల్లో తమ తమ పార్టీలకు కలిసి వస్తుందనేది ఓ నమ్మకంగా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎంత దూకుడుగా వెళ్తే అంత కలిసి వస్తుందనేది నేటి ట్రెండ్. ఎవరికి వారు తగ్గేదే లే అన్నట్లుగా తిట్ల దండకాలతో మసాల నూరుతున్నారు. ప్రజాస్వామ్యంలో విరమర్శలే ప్రభుత్వ పనితీరును మెరుగుపరిచే సాధనాలు. ఏదైనా ఓ అంశంపై ప్రతిపక్షాలు లొసుగులను పసిగట్టి విమర్శిస్తే వాటిని సహేతుకంగా చూసుకుంటూ ప్రభుత్వాలు తమ విధానాలను రూపొందించుకుంటాయి. కానీ, మారుతున్న కాలంతో రాజకీయ చదరంగంలో తిట్లే తమ గెలుపుకు సోపానాలు అన్నట్లుగా నేతల ప్రవర్తన మారిపోతోంది. విమర్శిస్తున్న క్రమంలో ఉపయోగిస్తున్న భాష చాలా బాధ్యతాయుతంగా ఉండేలా చూసుకోవడం సంస్కారం. కానీ తెలంగాణలో మాత్రం నేతల మాటలు శృతి మించుతున్నాయి. చెవులకు చిల్లులు పడేలా తిట్టదండకాలు అల్లుతున్నారు నేతలు. ఇలాంటి ఓ దుష్ట సాంప్రదాయం తెలంగాణ రాజకీయాల్లో మంచిది కాదనేది పండితుల అభిప్రాయం. ఇకనైనా నేతలు తమ తీరును మార్చుకుంటారో లేక ఇలానే కంటిన్యూ అవుతారో కాలమే చెప్పాల్సిన సమాధానం.

# అసంతృప్త ఎమ్మెల్యేలు పై గురి

అదిలాబాద్, ఏప్రిల్ 22, :ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ సోయం బాపూరావు మరోసారి ఘాటు వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. బుధవారం ఇంద్రవెల్లిలో జరిగిన ఆదివాసీ అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతూ ఆయన చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఏ మాత్రం ఛాన్స్ ఉన్నా అధికారపార్టీపై నిప్పులు చెరిగే సోయం బాపూరావు ఇంద్రవెల్లి వేదికగా అధికార టీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆదివాసీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులను టార్గెట్ చేయడంతో పొలిటికల్ ఇంట్రెస్ట్‌గా మారింది. ఆదివాసీల అభ్యున్నతి కోసం తుడుందెబ్బ ఏర్పడిందని చెప్పిన సోయం బాపూరావు.. టీఆర్ఎస్‌లో ఉన్న ఆదివాసీ ఎమ్మెల్యేలైన ఆత్రం సక్కు, రేగా కాంతారావు, మాజీ ఎంపీ గోడం నగేష్, కుమురం భీం జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కోవా లక్ష్మి, పొదెం వీరయ్యలపై నిప్పులు చెరిగారు. వీరంతా తుడుం దెబ్బను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రకు పాల్పడుతున్నారని.. ద్రోహులను నమ్మి మోసపోవద్దని సూచించారు. తుడందెబ్బ పేరుతో ఎవరైనా వసూళ్లకు పాల్పడితే వదిలిపెట్టే ప్రసక్తే లేదని వార్నింగ్ ఇచ్చారు.టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఆదివాసీలపై ప్రేమ ఉంటే సుప్రీం కోర్టు కొట్టివేసిన జీవో నెంబర్ 3ను ఆర్డినెన్స్ ద్వారా పునరుద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సవాల్ చేశారు. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని అమలు చేయకుంటే అధికారుల బట్టలూడదీయాలని ఘాటు వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

# బోరిస్ పర్యటన చారిత్రాత్మకం

(మొదటి పేజీ తరువాయి)

జైశంకర్ కూడా భేటీ అయ్యారు. బోరిస్.. భారత్‌ను తమ స్నేహితుడిగా అర్థం చేసుకున్నాడని ప్రధాని మోడీ వివరించారు. బ్రిటన్ ప్రధానికి కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న తన స్నేహితుడు అయిన బోరిస్ జాన్సన్‌ను ఇండియాలో చూసిన తరువాత చాలా ఆనందం వేస్తున్నదని తెలిపారు. బోరిస్‌తో చర్చల కోసం చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నట్టు మోడీ ప్రకటించారు. న్యూ ఏజ్ ట్రేడ్ డీల్‌పై కూడా చర్చించినట్టు వివరించారు. అదేవిధంగా రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో.. పలు విషయాలు కూడా ఇరు దేశాల ప్రధానులు చర్చించారు. ఉత్పత్తి, సేవల రంగం, పెట్టుబడులు, మేధో సంపత్తి హక్కులు, జియో గ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ ట్యాగ్) వంటి అంశాలపై చర్చించినట్టు వివరించారు. రక్షణ రంగంలో ఆయుధాల సేకరణ, ముడి సరుకుల సరఫరా సహా దేశీయంగా ఫైటర్ జెట్స్‌ను తయారు చేసుకునే విషయంపై కూడా బోరిస్‌తో మాట్లాడినట్టు మోడీ తెలిపారు.

## రష్యాపై ఆధారపడొద్దు, ఏ సాయమైనా చేస్తాం.. ఇండియాకు అమెరికా ఆఫర్

(మొదటి పేజీ తరువాయి)

రష్యాపై తాము ఆంక్షలు విధించిన నేపథ్యంలో అనేక దేశాలనుంచి ఎగుమతులు నిలిచిపోయాయని, ప్రముఖుల ఆస్తులు స్తంభింపచేశామని షెర్మన్ పేర్కొన్నారు. ఈ పరిస్థితులను సానుకూలంగా మలుచుకుని ఆయా వస్తువులు, పదార్థాలు, ఆయుధాలు రష్యాకు చైనా చేరవేస్తోందని మండిపడ్డారు. కాగా ఈనెల తొలివారంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడారు. చైనాతో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రష్యానుంచి ఆయుధాలు దిగుమతి చేసుకుంటున్నామని, ఇతర దేశాలనుంచి ఆయుధాల కొనుగోలు భారీ వ్యయంతో కూడుకున్నదని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## వరంగల్ ప్రేమోన్మాది దాడి ఘటనపై గవర్నర్ తమిళిసై విచారం

హైదరాబాద్: వరంగల్ ప్రేమోన్మాది దాడి ఘటనపై తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై విచారం వ్యక్తం చేశారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో బాధితురాలు చికిత్స పొందుతుంది. యువతి ఆరోగ్య పరిస్థితిపై గవర్నర్ తమిళిసై ఆరా తీశారు.



యువతికి మెరుగైన వైద్యం అందించాలని గవర్నర్ అధికారులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా చూడాలని తమిళిసై అన్నారు.






# వడ్డీ ఇలా.. వసూళ్లు అలా...

నిజామాబాద్, ఏప్రిల్ 22, :అక్కడ క్లబ్బుల మాటున కేవలం జూదం మాత్రమే నడవడం లేదు. చట్టాలను ఉల్లంఘిస్తూ నడుస్తున్న దందాలు అన్ని ఇన్ని కావు. అక్రమ ఫైనాన్స్ దందాలకు కూడా అవి ప్రధాన కేంద్రంగా మారిపోయాయన్న ప్రచారం జరుగుతోంది. రిక్రియేషన్, స్పోర్ట్స్ క్లబ్బుల పేరిట అనుమతులు తెచ్చుకుంటున్న నిర్వాహకులు పేకాట రాయుళ్లకు అప్పులు ఇస్తూ మరో వ్యాపారానికి కూడా తెరలేపారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.జూదం కేంద్రాల్లో సాగుతున్న ఈ తతంగంలో భాగంగా డబ్బులు కోల్పోయిన వారికి అప్పులు ఇచ్చే ప్రక్రియ కూడా సాగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. డబ్బులు పోగొట్టుకున్న వారి వద్ద బంగారం తనఖా పెట్టుకుని అప్పటికప్పుడు అప్పులు ఇచ్చేందుకు కూడా నిర్వాహకులు సిద్ధపడుతున్నారని తెలుస్తోంది. తమ ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను కుదువ పెట్టగానే నిర్వహాకులు వాటిని తూకం వేయించి వాటి విలువలో 50 నుండి 60 శాతం వరకు నగదును జూదగాళ్లకు అప్పుగా ఇస్తున్నారు. ఇందుకు 10 శాతం వడ్డీ కూడా వసూలు చేస్తున్నారని బాధితులు వివరించారు. లక్షలు పోగొట్టుకున్న తరువాత తమ హైండ్ రేజ్ అవుతోందని కలలు కంటున్న బాధితులు తమ వద్ద ఉన్న బంగారు గొలుసులు, ఉంగరాలు, బ్రాస్లెట్‌లు తనఖా పెట్టి అప్పులు తీసుకుంటున్నట్టుగా సమాచారం.జూదగాళ్ల బలహీనతలను దృష్టిలో పెట్టుకున్న నిర్వహాకులు ఎమర్జెన్సీ బ్యాంకులను కూడా తెరిచి రుణాలు ఇచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్టుగా తెలుస్తోంది. తమ వద్ద ఉన్న ఆభరణాలు కుదువ పెట్టి పేకాటలో డబ్బులు పోగొట్టుకున్న వారు కోకొల్లలని సమాచారం. బంగారం వస్తువులు పెట్టి అప్పు తీసుకున్న కొంతమంది డబ్బులు చెల్లించి తమ ఆభరణాలను తీసుకెళ్లే పరిస్థితి కూడా లేకపోవడంతో అవి ఏమయ్యాయో ఇంట్లో వారికి చెప్పలేక, క్లబ్బుల నిర్వాహకుల వద్ద తాకట్టు నుండి విడిపించుకోలేక మదిలోనే కుమిలిపోతున్నారు. రిక్రియేషన్, స్పోర్ట్స్ క్లబ్బుల పేరిట నిర్వాహకులు లైసెన్స్ తీసుకున్నదొకటయితే అక్కడ నిర్వహిస్తున్నతంతు మరోకటి కాగా ఏకంగా మని లెండరింగ్ యాక్ట్‌ను కూడా ఉల్లంఘిస్తున్నారు. జూదగాళ్ళ బలహీనతలను ఆసరాగా చేసుకుని ఏకంగా వడ్డీ వ్యాపారానికి కూడా తెరలేపడం విమర్శలకు దారి తీస్తోంది. క్లబ్బులపై దాడులు చేసినప్పుడు కేవలం గేమింగ్ యాక్టపై క్రిమినల్ కేసులు పెట్టడమే కాకుండా లైసెన్స్ లకు సంబంధం లేకుండా జూదం నిర్వహిస్తున్నారని, అలాగే ఆర్బీఐ అనుమతి లేకుండా ఫైనాన్స్ దందా చేస్తున్నారని, అడ్డగోలు వడ్డీలు వసూలు చేస్తున్న తీరుపైనా ఆయా చట్టాలను ఉపయోగించినట్లయితే ఇలాంటి దందాగాళ్లను ఎక్కడికక్కడ కట్టడి చేయోచ్చని అంటున్నారు బాధిత కుటుంబాల సభ్యులు.మోజులో కుటుంబాలను వదిలి చివరకు ఆస్తులను కూడా కోల్పోయి రోడ్డున పడ్డ కుటుంబాల సంఖ్య కూడా ఇటీవల కాలంలో తీవ్రంగా పెరిగిపోతోంది. కొంతమంది అయితే ఉన్న ఊరును కూడా వదిలేసి బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు కూడా వలన వెళ్లిపోయారని తెలుస్తోంది. మరికొంతమంది బాధితుల తీరుతో విసిగిపోయి భార్యాపిల్లలు వారిని వదిలేసిన సంఘటనలు కూడా ఉన్నాయని సమాచారం. చట్ట విరుద్ధంగా సాగే పేకాటలో పాల్గొని రోడ్డున పడ్డామన్న విషయాన్ని బయటకు పొక్కనీయకుండా జాగ్రత్త పడుతూ మింగలేక కక్కలేక జీవనం సాగిస్తున్న వారు లేకపోలేదురాష్ట్ర సరిహద్దుల్లోని బల్లార్షాలోనూ జూదం కేంద్రం దర్జాగా నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. బల్లార్షా రహదారిలోని ఓ చోట పేకాట కేంద్రం నిర్వహిస్తున్నారని ఇక్కడకు పెద్ద ఎత్తున మంచిర్యాల ప్రాంతానికి చెందిన జూదగాళ్లు తరలివెల్తున్న ట్టుగా సమాచారం. ధర్మాబాద్ నుండి మొదలైన క్లబ్బుల ప్రస్థానం అంతా కూడా తెలంగాణా రాష్ట్ర సరిహద్దుల్లోనే సాగుతుండడం గమనార్హం. సరిహద్దుల్లో 20 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్ల లోపలే ఈ క్లబ్బులు ఏర్పాటు చేయడం వెనుక ఆంతర్యం ఏంటో అర్థం చేసుకోవచ్చు

ప్రజాపాలన
సంపాదకీయం
శనివారం 23, ఏప్రిల్ 2022

# ధ్వంసమవుతున్న భారత ధర్మం

'అల్పసంఖ్యాక వర్గం వారి ఆగడాలకు మీరు బాధితులని, మిమ్ములను సంరక్షించగలిగేది నేను మాత్రమేనని అధిక సంఖ్యాక వర్గం వారిని మీరు నమ్మించగలిగితే ప్రజాస్వామిక సమాజంలో మీరు ఏ ఉన్నత స్థాయికి అయినా చేరుకోగలరు'- చదరంగం చక్రవర్తి గారీ కాస్పరోవ్ 2016లో డొనాల్డ్ ట్రంప్ అమెరికాను ప్రస్తావిస్తూ పలికిన ఈ నిష్ఠుర సత్యం 2022లో నరేంద్ర మోదీ భారత్‌కూ వర్తిస్తుంది. సదృశత కొట్టొచ్చినట్టు కన్పించడం లేదూ! సంఖ్యానేక భారతీయుల ఆరాధ్య దైవాల జయంతి వేడుకలు మతోన్మాద మంటల భగభగలకు ఆలవాలమయ్యాయి. ఈ వైపరీత్యం ఏదో ఒక ప్రదేశంలో సంభవించడం కాదు, అరడజనుకు పైగా రాష్ట్రాలలో భిన్న మతస్థుల మధ్య సుహృద్భావాన్ని దెబ్బ తీసింది. అంతకంటే ఘోరం సదరు సంఘటనలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అవటం. శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి ప్రదర్శనలపై రాళ్లు రువ్వడాన్ని చూపించిన వీడియోలవి. అధిక సంఖ్యాక మతస్థులలో అవి ఎటువంటి భావనను నెలకొల్పుతున్నాయనేది మరి చెప్పాలా? హింసాత్మక ఆవేశకావేశాలతో చెలరేగిపోతున్న అల్పసంఖ్యాక వర్గం దౌర్జన్యాలకు హిందువులు బాధితులు అవుతున్నారన్న అభిప్రాయాన్ని ఆ వీడియోలు దృఢతరం చేస్తున్నాయి. అంతేకాదు, ఆ అల్పసంఖ్యాక వర్గం వారికి ఒక పాఠం నేర్పితీరాలన్న తలంపును 'బాధితుల'లో బలోపేతం చేస్తున్నది.అయితే కనిపించేదే నిజమా? సత్యం సదా జటిలంగా ఉంటుంది. శ్రీరామ నవమి, హనుమ జయంతి వేడుకలలో పాల్గొన్నవారు మైనారిటీ మతస్థులను దుర్భాషలాడారు. వారికి వ్యతిరేకంగా భీతావహం కలిగించే నినాదాలు ఘోషించారు. హిందూత్వ వర్గాల వారి బహిరంగ బెదిరింపులను కోపోద్రిక్త ఇస్లామిస్ట్ శ్రేణులు అదే రీతిలో ప్రతిస్పందించాయి. ఈ పరిణామాలు సూచిస్తున్నదేమిటి? దేశానికి అమంగళకర భవిష్యత్తును కాదూ? సందేహం లేదు, అవి దుశ్శకునాలే. ఇవి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' స్వప్నాన్ని తప్పక భగ్నం చేస్తాయి. గతంలో సంకుచిత ప్రయోజనాలకు ఆలంబనగా చేసుకున్న విద్వేష రాజకీయాలు ఇప్పుడు క్లిష్ట పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఒకనాడు ప్రజల గుర్తింపుకే నోచుకోని సంస్థలు నేడు జాతి జీవన ప్రధాన స్రవంతిలో అంతర్భాగమయ్యాయి.ఈ మతతత్వ హింసాకాండ భౌగోళిక విస్తృతిని చూడండి. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్, కర్ణాటక, గుజరాత్‌లతో పాటు ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాజస్థాన్, బెంగాల్, ఒడిషా, జార?ండ్‌లను కూడా ఆ వేడి బలంగా తాకింది. చివరకు జాతీయ రాజధాని న్యూఢిలీల్లో సైతం ఆ మతోన్మాద రక్కసి తన రాక్షసత్వాన్ని ప్రదర్శించింది. దేశ రాజధానిలో పోలీసు శాఖ కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యవేక్షణలో ఉంటుందనేది ఇక్కడ ప్రత్యేకంగా గుర్తు చేయవలసి ఉంది. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. అలాగే కాంగ్రెస్ పాలనలో ఉన్న రాజస్థాన్‌లో కూడా. ఇక ఢిల్లీలో ఈ ఏడాది ద్వితీయార్థంలో కీలక మునిసిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మతతత్వ వేడి క్రమంగా పెరుగుతోంది. అలాగే విభజించి పాలించే క్షుద్ర రాజకీయాలు మళ్లీ బుసలు కొడుతున్నాయి.ఇదొక కీలక సమయం. మతపరమైన అస్తిత్వాల పరిరక్షణకు 'పాత' భారత దేశం చేసిన పోరాటాల నుంచి శీఘ్ర అభివృద్ధి, మెరుగైన జీవన ప్రమాణాలు సాధించుకోవడానికై 'కొత్త' భారతదేశం ఆరాటాలపై మనం మన దృష్టిని మళ్లీ కేంద్రీకరించాలి. నిరంతర ఇబ్బందుల నుంచి శతాధిక కోట్ల ఆకాంక్షల నవ్య, భవ్య భారతదేశం వైపుగా మన ప్రస్థానం సాగాలి. అయితే మనం అలాంటి సంకల్పంతోనే ఉన్నామా? లేదు. భావోద్వేగాలకు ప్రాధాన్యమిస్తున్నాం. విభేదాలను సృష్టించే అంశాలను పట్టుకు వేలాడుతున్నాం. సంకుచిత వైఖరులతో మన ముస్లిం సహోదరులను 'ఇతరులు'గా పరిగణిస్తున్నాం. వారినలా వేధిస్తున్నాం. తొలుత హిజాబ్‌ను నిషేధించాం. పిదప హలాల్ మాంసాన్ని తిరస్కరించాం. తుదకు అజాన్‌ను ఆక్షేపిస్తున్నాం.ఆదాయాలు పడిపోతున్నాయి. ధరలు పెరిగిపోతున్నాయి. కాయకష్టం మీద బతికేవారేకాదు, మధ్యతరగతి ప్రజలు అల్లల్లాడిపోతున్నారు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి ఆ అశేష ఆర్తజనుల దృష్టిని మళ్ళించేందుకే మతతత్వ భావావేశాలను రెచ్చగొడుతున్నారని, హిజాబ్, హలాల్, అజాన్‌లు అందుకు ఆయుధాలు అయ్యాయని కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ సూచించారు. ఆయన సబబుగా చెప్పారు. అయితే అదే పూర్తిగా సమంజసమైన కారణం కాదు. ఎందుకని? సంఘ్ పరివార్ హిందూ రాష్ట్ర స్థాపన లక్ష్య పరిపూర్తికి 'మత-సాంస్కృతిక' పోరాటం కీలకమైనది. ఇప్పుడు ఆ పోరాటం ఉధృతమైనది. అసాధారణంగా ముందంజలో ఉంది. ఎనిమిది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న తాము, లక్ష్య సాధనకు చేరువయ్యామని హిందూత్వ ఉన్మాదులు విశ్వసిస్తున్నారు. ఆఖరి, నిర్ణయాత్మక పోరాటం చేయవలసిన సమయమాసన్నమయిందని వారు భావిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ వరుసగా రెండోసారి విజయం సాధించడం వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.వివిధ ఆయుధాలను ప్రదర్శిస్తూ శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వేడుకలను కలహశీలంగా నిర్వహించడం ఆ స్వప్న సాధనా ప్రయత్నాలలో భాగమేనని చెప్పవచ్చు. తద్వారా హిందూ సాంస్కృతిక వైభవ పునరుద్ధరణను అడ్డుకోవడం ఇక ఎవరి వల్లా సాధ్యంకాబోదనే సందేశాన్ని సంఘ్ పరివార్ పంపించింది. 19వ శతాబ్ది తుదినాళ్ళలో వినాయక చవితి పండుగను లోక్‌మాన్య తిలక్ ఉద్దేశపూర్వకంగా ఒక సామూహిక ప్రజా వేడుకగా మార్చివేశారు. బ్రిటిష్ వలసపాలనకు వ్యతిరేకంగా కుల మతాలకు అతీతంగా సమాజాన్ని సమైక్యం చేసే సదుద్దేశమే ఆయన్ని అందుకు పురిగొల్పింది. 21వ శతాబ్దిలో హిందూత్వ శక్తులు శ్రీరాముడు, హనుమంతుడిని మతపరమైన పురుషాహంకృత శక్తిశీలతకు ప్రతీకలుగా ఉపయోగిస్తున్నాయి. ఇది సంప్రదాయ ఆచార కాండకు భిన్నమైనది, కాదు, విరుద్ధమైనది. కాకపోతే శ్రీరామనవమి ప్రదర్శనల సందర్భంగా మస్జీదుల ఎదుట ఉద్దేశపూర్వకంగా సంగీతాన్ని విన్పించేందుకు ప్రయత్నించడమేమిటి? తద్వారా హిందూత్వ శక్తులు పంపుతున్న సందేశం స్పష్టమే: అజాన్‌కు లౌడ్ స్పీకర్లను ఉపయోగించుకోవడానికి ముస్లింలు అనుమతిస్తున్నప్పుడు, ఆ మతస్థులు అధికంగా ఉన్న మొహల్లాలలో తమ ఉనికిని చాటుకునేందుకు హిందూత్వ బృందాలు మస్జీదుల ముందు తప్పకుండా తమ పాటలను హోరెత్తిస్తాయి.విశ్వహిందూ పరిషత్, భజ్‌రంగ్‌దళ్‌లకు ఇటువంటి సమరశీల మత రాజకీయాలు ఒక జీవరేఖ అని చెప్పి తీరాలి. రామజన్మ భూమి ఉద్యమం తొలినాళ్లలో కీలకపాత్ర వహించిన ఈ సంస్థలు ప్రస్తుత రాజకీయ వాతావరణంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. గతంలో వలే బీజేపీ ఎన్నికల యంత్రాంగం తమపై అంతగా ఆధారపడకపోవడం ఈ ఉభయ సంస్థలకు ఏమాత్రం సంతోష దాయకంగా లేదు. బీజేపీ తరపున పార్లమెంటు, శాసనసభలకు ఎన్నికైన రాజకీయవేత్తలు అధికారంపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారు. అయితే విశ్వహిందూ పరిషత్, భజ్‌రంగ్‌దళ్‌లకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కల్పించడం లేదు. మారిన పరిస్థితులలో, చట్టబద్ధమైన లేదా పాలనాపరమైన అవరోధాలు ఏవైనప్పటికీ తమకూ కీలక భాగస్వామ్యం కల్పించాలని ఆ ఉభయ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి.

# అభాగ్య ఖైదీలకు న్యాయమందేనా?

భారతదేశంలో ఒక నేరస్థుడికి బెయిల్ వచ్చేందుకు అతడి నేరాల తీవ్రతతో నిమిత్తం ఉండదు. ఎంతఘోరమైన నేరానికి పాల్పడ్డా ఎవరికి బెయిల్ ఎప్పుడు వస్తుందో, ఎవరికి రాదో చెప్పడం కష్టం. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కుమారుడైన ఆశిష్ మిశ్రా లఖీంపూర్ ఖేరీలో రైతులపై వాహనం నడిపించి 8 మంది మరణానికి కారకుడైతే, అతడికి బెయిల్ ఇచ్చేందుకు అలహాబాద్ హైకోర్టు ఉత్సుకత ప్రదర్శించిన తీరును సాక్షాత్తు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీరమణ తప్పుపట్టారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బెయిల్‌ను వ్యతిరేకించనంత మాత్రాన కేవలం ప్రభుత్వ స్వరాన్నే పట్టించుకుని బాధితుల స్వరాన్ని విస్మరించడం దారుణమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 'ఈ దేశంలో నేరాల బాధితులకు స్వరాన్ని పార్లమెంట్, న్యాయవ్యవస్థ ఇచ్చాయి. ఆ స్వరాన్ని వినాల్సిన అవసరం ఉన్నది. వినకపోతే స్పష్టంగా వినిపించేలా గొంతెత్తి అరవాలి. ప్రతి దశలోనూ న్యాయస్థానం బాధితుడి స్వరం వినాలి' అని పేర్కొంది. ఆశిష్ మిశ్రా బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది.భారతదేశంలో క్రిమినల్ జస్టిస్ ఎటువంటి దుస్థితిలో ఉన్నదో సుప్రీంకోర్టు వ్యాఖ్యలను బట్టి అర్థం చేసుకోవచ్చు. పలుకుబడిగలవారికి, సంపన్నులకు, అధికారంలో ఉన్న వారికి అనుగుణంగా మాత్రమే న్యాయవ్యవస్థ పనిచేస్తుందని, అభాగ్యుల స్వరాలను పెద్దగా పట్టించుకోదనే అభిప్రాయం ఇవాళ సర్వత్రా నెలకొన్నది. భారత ప్రభుత్వ లెక్కల ప్రకారమే జైళ్లలో ఉన్న ప్రతీ నలుగురు ఖైదీలలో ముగ్గురి కేసులు విచారణ దశలోనే ఉన్నాయి. చిన్న చిన్న నేరాలకు పాల్పడినవారు న్యాయవాదులను నియమించుకోలేక, బెయిల్ కోసం పూచీకత్తులు కట్టుకునే పరిస్థితి లేక జైళ్లలోనే కునారిల్లుతున్న ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. సగటున ఒక జిల్లా జైలు 136 శాతం ఖైదీలతో నిండిపోయిందని 'ప్రిజన్ స్టాటిస్టిక్స్ ఇండియా' నివేదిక వెల్లడించింది. దేశ రాజధాని ఢిల్లీలో 90 శాతానికి పైగా ఖైదీలు కేసులు విచారణ దశలో ఉన్నవారే. విచారణ దశలో కేసులు కొనసాగుతున్న ఖైదీల్లో అత్యధికులు ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వర్గాల వారు, రెక్కాడితే కాని డొక్కాడని వారే. సగం మంది ఖైదీలు 1830 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారే. 'నా కుమారుడిని మొబైల్ చోరీ కేసులో ఇరికించి నాలుగు కేసులు మోపారు. ఏడాది నుంచీ కోర్టు చుట్టూ, తీహార్ జైలు చుట్టూ తిరుగుతున్నాను. పూచీకత్తుకోసం డబ్బులు పోగు చేస్తున్నాను' అని ఒక స్వీపర్ తెలిపింది. భారతదేశపు జైళ్లలో ఉన్న అభాగ్య ఖైదీలు ఈ దేశ ఆర్థిక, ప్రజాస్వామ్య వ్యవస్థకు చిహ్నాలు అనడంలో సందేహం లేదు. అందరికీ పనిచేసేందుకు అవకాశాలు లభించి, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడితే, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం అందరికీ సమానంగా లభిస్తే, న్యాయవ్యవస్థ పేదలకు అనుకూలంగా ఉంటే జైళ్లు అభాగ్యులతో ఎందుకు నిండిపోతాయి?దేశంలో ఎన్ని దౌర్భాగ్యాలున్నప్పటికీ అప్పుడప్పుడూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీరమణ లాంటి వారు ఇచ్చే తీర్పులు న్యాయవ్యవస్థ మన దేశంలో ఇంకా సజీవంగా ఉన్నదనే అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. ఆయన రూపొందించిన ఫాస్టర్ వ్యవస్థ కూడా కోర్టులు ఇచ్చే తీర్పులు వేగంగా జైళ్లకు చేరి నిందితులు బెయిల్‌పై శీఘ్రంగా విడుదలయ్యేందుకు వీలు కలిగించింది. అభాగ్యులకు న్యాయసహాయం అందించేందుకు నల్సార్ వంటి సంస్థలు కొంతవేరకు తోడ్పడుతున్నాయి. గత ఏడాది ఢిల్లీ అల్లర్ల కేసులో నిందితులైన విద్యార్థి కార్యకర్తలు నటాషా నర్వాల్ , దేవంగనా కలితా ఏడాదికి పైగా జైలులో మ్రగ్గుతుంటే ఢిల్లీ హైకోర్టు జస్టిస్ అనూప్ బంభాని, జస్టిస్ సిద్దార్థ మృదుల్ వారిని విడుదల చేసేందుకు చరిత్రాత్మకమైన తీర్పునిచ్చారు. 'నిరసనను అణిచివేసే ఆతురతలో, పరిస్థితి చేయి దాటిపోతుందన్న భయంతో ప్రభుత్వం రాజ్యాంగం ప్రసాదించిన నిరసన తెలిపే హక్కుకూ, ఉగ్రవాద చర్యకూ మధ్య తేడా చూడలేకపోతోంది. దాని వల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది' అని ఢిల్లీ హైకోర్టు బెంచ్ వ్యాఖ్యానించింది. ఒక వ్యక్తిని సుదీర్ఘకాలం యూఏపిఏ క్రింద జైలులో ఉంచడం అతడి ప్రాథమిక హక్కుకు భంగకరమని, దీనివల్ల న్యాయ పరిపాలనా వ్యవస్థపై ప్రజల విశ్వాసం పోతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా గత ఏడాది ఇచ్చిన మరో తీర్పులో అభిప్రాయపడ్డారు. 'విచారణ దశలో నిందితులను సుదీర్ఘకాలం నిర్బంధించరాదు. వేగంగా విచారణ జరగకపోతే వ్యక్తిగత స్వేచ్ఛ హరించుకుపోతుంది, ఇది రాజ్యాంగంలోని అధికరణ 21 క్రింద జీవించే హక్కుకు భంగకరం' అని వారు స్పష్టం చేశారు. ఈ తీర్పులు దేశంలో 'చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం' (యుఏపిఏ) దేశంలో దుర్వినియోగమవుతున్న తీరుకు నిదర్శనం. ఈ చట్టం కూడా వేలాది మంది బెయిల్ లేకుండా జైళ్లలో మగ్గేందుకు కారణమవుతోంది. కేంద్ర హోంశాఖ పార్లమెంట్‌కు ఇచ్చిన జవాబు ప్రకారమే 201820 మధ్య 4390 మంది యుఏపిఏ క్రింద అరెస్టు కాగా వారిలో 2500 మంది 30 ఏళ్ల లోపు వయసున్నవారే. అమెరికాలో 9/11 తర్వాత మానవ హక్కుల విషయంలో ఉగ్రవాదులకూ, సామాన్యులకూ మధ్య తేడా చూడాల్సిన అవసరం ఉన్నదని అనేక దేశాలు ప్రపంచ వ్యాప్తంగా భావించాయి. న్యాయవ్యవస్థ కూడా ఈ ఆలోచనను జీర్ణించుకుంది. అయితే ప్రతీ ప్రజాస్వామిక నిరసననూ ఉగ్రవాదంగా భావించే పరిస్థితి లేకుండా ఉండాలంటే, రచయితలను, మేధావులను, జర్నలిస్టులను కూడా ఉగ్రవాదులుగా భావించకుండా ఉండాలంటే ప్రభుత్వ ఆలోచనా విధానానికి అతీతంగా, ప్రాసిక్యూషన్ వాదనలకు భిన్నంగా న్యాయవ్యవస్థ వ్యవహరించవలిసి ఉంటుంది.ఈ నేపథ్యంలో ఇటీవల భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమణ, అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బ్రెయర్‌ల మధ్య ఒక తొలి అంతర్జాతీయ అంతర్జాల చర్చా గోష్టికి ప్రాధాన్యత ఉన్నది. జీవించే హక్కు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించే విషయంలో మన కంటే అమెరికా న్యాయవ్యవస్థ ఎంతో ముందంజలో ఉన్నదనడంలో సందేహం లేదు. జాతి వివక్షా పరిస్థితులను అమెరికా న్యాయవ్యవస్థ ఎంతో సమర్థంగా ఎదుర్కొన్నది. క్రిమినల్ జస్టిస్ విషయంలో మన న్యాయవ్యవస్థ ఏ మాత్రం అమెరికా న్యాయవ్యవస్థతో సరితూగదు. నిజానికి రాజ్యాంగ ముసాయిదా రూపొందించేటప్పుడు మనం అమెరికా రాజ్యాంగాన్ని, ఆ రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను, అక్కడ న్యాయవ్యవస్థకు ఉన్న రాజ్యాంగపరమైన ఆధిక్యతను పరిగణనలోకి తీసుకున్నాం. మానవ హక్కుల విషయంలో అమెరికా రాజ్యాంగ ప్రభావం మన దేశంపై ఎంతో ఎక్కువ. అక్కడి న్యాయవ్యవస్థ తీరుతెన్నులను కూడా మనం అనుసరించాము. చట్టం ముందు అందరూ సమానులేనన్న మన దృక్పథం కూడా అమెరికా, బ్రిటన్‌ల నుంచి వచ్చిందే. అమెరికా రాజ్యాంగాన్ని మనం జాగ్రత్తగా అధ్యయనం చేయాలని, అయితే దాన్ని మన సామాజిక, రాజకీయ, ఆర్థిక జీవనానికి అనుగుణంగా అవసరమైన మార్పులతో అనుసరించడం మంచిదని రాజ్యాంగ సభ అధ్యక్షుడు బాబూ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ప్రధానంగా మన ప్రాథమిక హక్కుల్లోని అధికరణలు 14, 19, 21లను చేర్చడంపై ఇతర దేశాలపై ఆధారపడ్డాం. ఆర్టికల్ 14, ఆర్టికల్ 19లను విశ్లేషించేటప్పుడు మన న్యాయమూర్తులు అమెరికా న్యాయమూర్తుల తీర్పులను ఉటంకించిన సందర్భాలున్నాయి. భావ ప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వాతంత్ర్యం నుంచి వేతనాల చెల్లింపు వరకు మన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులను అమెరికా తీర్పులు ప్రభావితం చేశాయనడంలో సందేహం లేదు. అయినప్పటికీ అమెరికా న్యాయవ్యవస్థలో లోపాలు లేవనలేము. 1967లో తొలి ఆఫ్రికన్ అమెరికన్ జస్టిస్ మార్షల్ అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయినప్పటికీ న్యాయవ్యవస్థలో అందరికీ సమాన అవకాశాలు ఇంకా రావల్సి ఉన్నదని జస్టిస్ బ్రెయర్ అభిప్రాయపడ్డారు. జీవించినంతకాలం న్యాయమూర్తిగా కొనసాగే అవకాశం ఉన్న పరిస్థితుల్లో 83 ఏళ్ల జస్టిస్ బ్రెయర్ తనంతట తాను స్వచ్ఛందంగా పదవీవిరమణ చేసేందుకు అంగీకరించడంతో అమెరికా సుప్రీంకోర్టులో తొలి నల్లజాతి మహిళను న్యాయమూర్తిగా నియమించేందుకు ఇటీవలే అవకాశం కలిగింది. అదే సమయంలో భారతదేశంలో కూడా సుప్రీంకోర్టులో నలుగురు మహిళా మహిళా న్యాయమూర్తులకు అవకాశం లభించడమనే చరిత్రాత్మక పరిణామం జస్టిస్ రమణ హయాంలో జరగడం గమనార్హం. మన దేశంలోని భౌగోళిక, సామాజిక వైవిధ్యం మన న్యాయవ్యవస్థలో ఇంకా ప్రతిఫలించాల్సి ఉన్నదని కూడా జస్టిన్ రమణ అభిప్రాయపడ్డారు.స్వల్పకాలంలో ప్రధాన న్యాయమూర్తిగా ఉంటానని తెలిసినప్పటికీ కీలకమైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలు పోస్టు కార్డుపై వచ్చినా స్వీకరించడం, మానవ హక్కుల విషయంలో స్పందించడం, శిథిలాలయాలుగా ఉన్న కోర్టులను ఆధునికీకరించడం, ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా వ్యవహరించకుండా కళ్లెం వేయడం, రాజకీయాల్లో నేరచరితులను ఏరివేయడం, మహిళలతో సహా వివిధ సామాజిక వర్గాల వారికి న్యాయవ్యవస్థలో భాగస్వామ్యం కల్పించడం మొదలైన కీలక ప్రయత్నాలను జస్టిన్ రమణ చేశారనడంలో సందేహం లేదు. అయితే అమెరికన్ న్యాయవ్యవస్థ ప్రమాణాలను అందుకోవడానికి ఆయన లాంటి అనేక మంది ప్రధాన న్యాయమూర్తులు మన న్యాయవ్యవస్థకు తప్పక అవసరం.




# పుడమితల్లిని కాపాడుకుందాం

ప్రస్తుతం మనం వాయుకాలుష్యం, వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్, వ్యర్థాల నిర్వహణ వంటి అనేక పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటున్నాం. పర్యావరణ సమస్యల గురించి తీవ్రంగా ఆలోచించడానికి, పర్యావరణ పరిరక్షణకు, ప్రపంచవ్యాప్తంగా ప్రజలను మేల్కొలిపి, అవగాహన కల్పించే సందర్భం ఇది. ప్రస్తుతం నిర్వహించుకుంటున్న ఈ 50వ ధరిత్రీ దినోత్సవం భూమాతను కాపాడుకోవడానికి మనం ఏమి చేయగలమో ఆలోచించాలని గుర్తుచేస్తుంది.ప్రజల దృష్టిని ఆకర్షించడానికి 'మన గ్రహం మీద పెట్టుబడి పెట్టండి' అనే నిర్దిష్ట అంశంతో మన ముందుకు వచ్చింది ఈనాటి 'ధరిత్రీ దినోత్సవం'. పర్యావరణ సమస్యలతో పాటు, వాతావరణ మార్పు అనేది ప్రపంచ దేశాలకు ఒక సవాలు. వాతావరణ మార్పులకు అనుగుణంగా, నివారణ చర్యలు చేపట్టకపోతే మనం, మన భవిష్యత్ తరాలు ప్రమాదంలో పడతాయి. వాతావరణ మార్పుల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవడం, వాటికి సహకరించడం ప్రతి వ్యక్తి బాధ్యత. అనేక ఉపద్రవాలకు కారణమయ్యే వాతావరణ మార్పులను ప్రపంచ దేశాలన్నీ ఉమ్మడిగా ఎదుర్కోకపోతే జీవకోటికి హాని సంభవిస్తుందని అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలో పారిశ్రామికాభివృద్ధి అధికమవడం వల్ల కర్బన ఉద్గరాలు అధికంగా విడుదల అవుతున్నాయి. దాంతో పర్యావరణ సమస్యలు పెరిగి భూతాపం పెరుగుతోంది. పారిశ్రామికీకరణ, అటవీ నిర్మూలన, భూమిపై ఉష్ణోగ్రత పెరుగుదలకు దారితీస్తుంది. చెట్లను నాటడం, అడవులను కాపాడడం, వాయు కాలుష్యాన్ని నియంత్రించడానికి వాహనాల వినియోగాన్ని కొంతవరకు తగ్గించడం, అవసరమైన మేరకే శక్తిని వినియోగించడం, అలాగే శక్తిని పరిరక్షించడం వంటి చర్యలను చేపట్టి పర్యావరణాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. 20వ శతాబ్దంలో భూమి సగటు ఉష్ణోగ్రత రెండు డిగ్రీలు పెరిగిందని అంచనా. ఇది వాతావరణంలో అపారమైన మార్పులకు కారణమైంది. వచ్చే శతాబ్దంలో 10 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని పరిశోధకుల అంచనా. నిత్య జీవితంలో వినియోగిస్తున్న ప్లాస్టిక్ నిర్మూలించడం ప్రస్తుతం ఒక సవాలుగా మారింది.మనమందరం పర్యావరణానికి హాని కలిగించకుండా,




ప్రకృతిని కాపాడడానికి సమిష్టిగా పనిచేద్దాం. ప్రజలను చైతన్యపరచేందుకు, ప్రజల సంక్షేమం కోసం కార్యకలాపాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించుకుందాం. సహజవనరుల అభివృద్ధి, వనరులను ఆదా చేయడం, పరిసరాల పరిరక్షణ, పర్యావరణ భద్రత, పర్యావరణ సమస్యలు, ప్రజారోగ్యం వంటి కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ప్రజలను చైతన్యపరుద్దాం. పర్యావరణ ప్రాముఖ్యత గురించి ప్రజలు తెలుసుకోవడానికి, పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపడతాం. ఈ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా చెట్లు నాటడం, ప్లాస్టిక్ బ్యాగ్స్ బదులుగా జ్యూట్ బ్యాగులు వినియోగించడం, స్వీయ మోటారు వాహనాలను కాకుండా, ప్రజా రవాణాను వినియోగించడం, పర్యావరణహిత వాహనాలను వినియోగించడం వంటివి చేస్తూ ప్రతిరోజును ధరిత్రీ దినోత్సవంగా భావిద్దాం.

# సంగం డైరీ పాల ఉత్పత్తి దారుల అవగాహన సదస్సు

విసుకొండ ఏప్రిల్ 22 (ప్రజాపాలన ప్రతినిధి): "సంగం డైరీ పాల ఉత్పత్తి దారుల అవగాహన సదస్సు"" వినుకొండ మండలం నరసరావుపేట రోడ్డు నందుగల సంగం డైరీ పరిధిలోగల సంఘములు కేంద్రములు వెండర్లు సెంటర్లలో పనిచేయుచున్న సిబ్బందికి సంగం డైరీ నూతనంగా ఏర్పాటు చేసిన డి.వి.సి అభయ స్కీమ్ పై అవగాహన సదస్సు వడ్లమూడి సంగం డైరీ డైరెక్టర్లు నర్ర .వెంకటకృష్ణ ప్రసాద్, శివరామయ్య ,పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ అన్ని జిల్లాలలో గల మన సంగం డైరీ అనుబంధ యూనిట్లలో ని పాల ఉ



త్పత్తిదారులకు వర్తించు ఈ పథకము నందు చేరిన వారు ఎవరైనా ప్రమాదవశాత్తు లేక సహజ మరణం పొందినప్పుడు వారి వారసులకు 50 వేల రూపాయలు చెల్లించ బడును. ఈ మొత్తమునకు అదనముగా సుదీర్ఘకాలం పాలు సరఫరా చేసిన ఉత్పత్తిదారులను గుర్తించి 5 నుండి పది సంవత్సరాలు పాలు సరఫరా చేసిన వారికి 10 వేల రూ పది సంవత్సరాలకు పైబడి పాలు సరఫరా చేసిన వారికి 15 వేల రూపాయలు డైరీ తమ సొంత నిధుల నుండి చెల్లించుట జరుగును. వయో పరిమితి లేని ఈ పథకంలో 18 సంవత్సరాలు దాటిన ఉత్పత్తిదారులు ఎవరైనా చేరవచ్చును. అలాగే గడిచిన రెండు సంవత్సరాల కాలంలో వరుసగా 150 లీటర్ల 150 రోజులు పాలు సరఫరా చేసి ఉండవలెను. వార్షికంగా చెల్లించవలసిన మొత్తము 270 రూపాయలు మాత్రమే మిగతా సొమ్ము మన డైరీ సబ్సిడీ గా 90 రూపాయలు సంఘము కేంద్రము వెండర్లు వారి వాటా గా 90 రూపాయలు మిగిలిన 90 రూపాయలు మాత్రమే పాల ఉత్పత్తిదారులు చెల్లించవలసి ఉడును. మరణం సంభవించు నాటికి సదరు ఉత్పత్తిదారుడు పాలు సరఫరా చేయు ఉండవలెను. పాల ఉత్పత్తి దారులు ఎవరైనా పథకంలో సరాసరి చేరదలచిన 180 రూపాయలు చెల్లింపు తో పాటు నిర్ణీత ప్రొఫార్మా లో వివరములు నింపి డైరీ అధికారులకు అందజేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమానికి కి సంగం డైరీ డైరెక్టర్లు నర్ర. వెంకటకృష్ణ ప్రసాద్, శివరామయ్య ,గంగినేని. హనుమంతరావు, వడ్లమూడి సంగం డైరీ మేనేజర్లు పి.ఆదినారాయణ, జి. నాగరాజు, వినుకొండ మేనేజర్ జి. నాగ ప్రభు, వర్కర్స్ యూనియన్ నాయకులు ఆలూరి. రమణయ్య, %చీ%. రామారావు ,వినుకొండ బ్రాంచ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ నెల్లూరు. సుబ్బారావు, ప్రెసిడెంట్ గోపీనాథ్ గౌడ్, పసుపులేటి. సుబ్బారావు, సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు అక్షింతల రాజా ఆర్థిక సహాయం



గోకవరం ప్రజాపాలన విలేకరి ఏప్రిల్ 22 : 20 422 వ తేదీ అర్ధరాత్రి రెండు గంటల సమయంలో గోకవరం గ్రామం స్థానిక ఆర్యవైశ్య వీధి నందు పెంకుటింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదం సంభవించి భారీ ఆస్తి నష్టం జరిగింది. ఈ ఇంట్లో అద్దెకుంటున్నటువంటి చింతల కుమారి గారికి సంబంధించిన బీరువాలో దాచుకున్న 20,000 రూపాయల ధనంతో పాటుగా గ్రైండర్, మరియు టీవీ, ఫ్యాన్ తదితర విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్నటువంటి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అక్షింతల రాజా గారు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడి వారిని ఓదార్చుటతో పాటుగా మానవతా దృక్పథంతో వారికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ ప్రబోధనా స్వచ్ఛంద సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తోట సాయిబాబు గారు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే గ్రంధి



భీమవరం, ఏప్రిల్ 22 (ప్రజాపాలన ప్రతినిధి) : ప్రజారోగ్యమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని శాసన సభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి వచ్చిన చెక్కులను స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 29 మంది లబ్ధిదారులకు రూ 16 లక్షల 69 వేల నిధులను చెక్కుల రూపంలో అందించడం జరిగిందని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ప్రజారోగ్యానికి పెద్దపేట వేయలేదని, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్రెడ్డి హయాంలోనే పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. నేడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకున్నారని అన్నారు. నేడు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో దాదాపుగా 2 వేల 500 వ్యాధులకు మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఎంపిక చేసిన కార్పొరేట్ ఆస్పత్రులలో కూడా ఉచితంగా వైద్యాన్ని అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో లేని వ్యాధులకు సైతం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రోగులకు వైద్యం అందిస్తున్నారని అన్నారు. అంతేకాకుండా వైద్యాన్ని మరింత దగ్గరగా ప్రజలకు చేరువ చేసేందుకు వైయస్సార్ హెల్త్ క్లినిక్ లను ఎక్కడికక్కడ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా భీమవరం పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నామని, జిల్లా ప్రజలకు ఈ ఆసుపత్రి దగ్గరగా ఉంటుందని శాసనసభ్యులు తెలిపారు.

## శ్రీ మదమంచి పాటీ వీరాంజనేయ స్వామి తిరుణాల సందర్భంగా రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన



వినుకొండ ఏప్రిల్ 22 (ప్రజాపాలన ప్రతినిధి):రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన వినుకొండ మండలం శ్రీ మదమంచి పాటీ వీరాంజనేయ స్వామి తిరుణాల సందర్భంగా గురువారం నాడు మదమంచి పాడు లో ప్రారంభమయ్యాయి మొదటి రోజు రెండవ రోజు రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన ఎద్దులు 650 కేజీల బండను రెండు పాల పళ్ళ సైజు దూడలు 24 జతలు పాల్గొన్నాయి అని కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు పళ్ళ సైజు,6 పళ్ళ సైజు, సేద్యపు సైజు, (న్యూ క్యాటగిరి) సబ్ జూనియర్ సైజు, జూనియర్ సైజు, సీనియర్ సైజు, 10 రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొదటి బహుమతి లక్ష రూపాయలు రెండవ బహుమతి 75 వేల రూపాయలు మూడవ బహుమతి 65 వేల రూపాయలు మూడు బహుమతులు శాసనసభ్యులు బొల్లా. బ్రహ్మనాయుడు చేతుల మీదగా అందజేస్తారని నాలుగో బహుమతి నాలుగో బహుమతి 55 వేల రూపాయలు గంధం బాల్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వినుకొండ అందజేస్తారని ఐదో బహుమతి 45 వేల రూపాయలు పరిమి. శేషయ్య, సర్పంచ్ పాత నాగిరెడ్డి పల్లి అందజేస్తారని ఆరో బహుమతి 35 వేల రూపాయలు పగడాల జయశ్రీ వెంకట్రామిరెడ్డి ఎంపీపీ వినుకొండ వారు అందజేస్తారని, ఏడవ బహుమతి 25 వేల రూపాయలు నక్క. నాగిరెడ్డి, ఉప సర్పంచ్ ఉప్పలపాడు అందజేస్తారని. ఎనిమిదో బహుమతి 20 వేల రూపాయలు సురభక్తుని రాజా జెడ్పీటిసి వినుకొండ అందజేస్తారని,9 బహుమతి 18 వేల రూపాయలు మేడం జయరామిరెడ్డి ఎంపీపీ నూజెండ్ల అందజేస్తారని, పదవ బహుమతి 15 వేల రూపాయలు బి రాములు ఎంపీపీ బొల్లాపల్లి అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ మదమంచి పాటి వీరాంజనేయ స్వామి గుడి కమిటీ మక్కెన. వెంకటరావు, అను %ఎశీశ్రీశ్రీబ% సుబ్బారెడ్డి, నక్క. వెంకటేశ్వర్ రెడ్డి, (బుల్లి రెడ్డి) జక్కి రెడ్డి. సుబ్బారెడ్డి, కూచిపూడి. చిన్న వెంకటేశ్వర్లు, జక్కిరెడ్డి అభిరెడ్డి, చాగంటి. యోగేశ్వరరావు, తదితరులు పాల్గొని నిర్వహిస్తున్నారు అని తెలిపారు.

## తోర్రేడు లో 52.43 ఎకరాల్లో 2454 మందికి ఇళ్ళ స్థలాలు..



రాజమహేంద్రవరం రూరల్ : ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. కె. మాధవీలత పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం తోర్రేడు గ్రామంలో జగనన్న కాలనీ లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సదర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటి ఫేజ్ లో 1156 మందికి ఇళ్ళు నిర్మాణం కోసం లబ్ధిదారులను గుర్తించి మంజూరు చెయ్యడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 135 మంది లబ్దిదారులు మాత్రమే ఇంటి నిర్మాణం చేపట్టడం జరిగిందని, మిగిలిన లబ్దిదారుల కుటుంబాలు కూడా వెంటనే ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం స్థలం మంజూరైన పేదలు ఇంటి నిర్మాణం చేసుకునేందుకు ఆర్థికంగా చేయూతను ఇస్తుందన్న విషయం వారికి తెలియచేసి లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో అతిపెద్ద లే అవుట్ లలో తోర్రేడుఒకటని, ఇక్కడ 2454 మంది కి ఇంటి పట్టాలు ఇవ్వడం జరుగుతోందని అధికారులు తెలిపారు. వెంకట్ నగర్ 102 బీ తోర్రేడు 252 బీ కొలమూరు.. 630 బీ కాతేరు .. 1470 మంది కి స్థలాలు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పిడి టి. తారా చంద్, ఈ ఈ ఆర్ ఆర్ సోములు, డీఈ పరుశురాం, ఏ ఈ శ్రీకాంత్, తహశీల్దార్ రియాజ్ ఉస్సెన్, ఎంపీడీఓ రత్న కుమారి, టెక్నికల్ అసిస్టెంట్ లు తదితులు హాజరయ్యారు.

## రావులపల్లి వీరాంజనేయులు కి ఘన సన్మానం



వినుకొండ ఏప్రిల్ 22 (ప్రజాపాలన ప్రతినిధి): వినుకొండ రైల్వే స్టేషన్ లో బుకింగ్ ఆఫీసు నందు గల పనిచేయుచున్న రావులపల్లి వీరాంజనేయులు, ఈ సంవత్సరం 2021-2022 సంవత్సరానికి గాను నిన్న గురువారం నాడు సికింద్రాబాద్ రైల్వే నిలయం నందు రైల్వే ప్రతిష్టాత్మకమైన జోనల్ రైల్వే అవార్డు అందుకున్న సందర్భంగా వినుకొండ రైల్వే స్టేషన్ లో తోటి సిబ్బంది ఘనంగా సన్మానించారు. విధినిర్వహణలో ఎంతో క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా ఉండే వీరాంజనేయులు ను, పలువురు అభినందించారు, ఈ సందర్భంగా రైల్వే అధికారులు టి హెచ్. ప్రసాద్, మరియు నరేంద్ర వర్మ, అవార్డు గ్రహీతలు ఆర్. ఆంజనేయులును, ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు సిహెచ్. నరేష్, మజ్దూర్ యూనియన్ నాయకులు భవాని శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ మిల్లు లో ప్రమాదం కార్మికుడు మృతి, మరోకార్మికుడికి తీవ్ర గాయాలు



పొన్నూరు ఏప్రిల్22( ప్రజా పాలన ప్రతినిధి) : పొన్నూరు మండలం బ్రాహ్మణ కోడూరు గ్రామంలో ని ఆయిల్ మిల్ లో సిలిండర్ పేలి బీహార్ కు చెందిన కార్మికుడు సచ్చన్ దార్ (38) మృతి చెందాడు.మరో కార్మికుడు గురు లేజర్ (28) తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్ కు తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రమాదం గురువారం మధ్యాహ్నం జరిగి ఒక కార్మికుడు మృతి చెంది మరో కార్మికుడు తీవ్ర గాయాలపాలైన విషయాన్ని మిల్లు యాజమాన్యం సమాచారాన్ని గోప్యంగా ఉంచడం పై పోలీసులు పలు కోణాల్లో విచారిస్తున్నారు.

## సాగర్ కుడి కాలువ లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కారంపూడి.. ఏప్రిల్22.. ప్రజాపాలన.. ప్రతినిధి :పట్టణంలోని వినుకొండ రోడ్డులో గల నాగార్జునసాగర్ కుడి కాలవ లో గుర్తు తెలియని మృతదేహం నీటి ప్రవాహంతో శవం కొట్టుకు రావడంతో మృతదేహం కారంపూడి నాగార్జునసాగర్ కుడి కాలవ దగ్గర కారంపూడి పోలీసులు మృతదేహాన్ని పక్కకు తీశారు కారంపూడి పోలీస్ వారు మాట్లాడుతూ అతని వయసు 60 నుంచి 65 సంవత్సరాలు ఉండవచ్చని తెలుపు రంగు పొడవు చేతుల చొక్కా తెలుపురంగు పంచ ఆకుపచ్చ అంచు కలిగి ఉన్నది ఎవరైనా సమాచారం తెలిసిన ఎడల కారంపూడి ఎస్సై ఫోన్ నెంబర్ 9440796178 తెలపగలరు.

## పట్టణంలో ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్న అధికారులు పట్టించుకోవడంలేదు: సీపీఎం పార్టీ నాయకులు

వినుకొండ ఏప్రిల్ 22 (ప్రజాపాలన ప్రతినిధి): పట్టణంలో ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు %ఎ% హనుమంత రెడ్డి, ప్రజాసంఘాల నాయకులు ఆంజనేయులు, ముని వెంకటేశ్వర్లు, కరుణ లు ఆరోపించారు. పట్టణ శివారు నూజండ్ల రోడ్డులోని శ్రీమతి గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలం ఆక్రమణలకు గురైందని విద్యార్థులు ఆందోళన చేయడం సిగ్గుచేటు. ప్రభుత్వ ఆస్తులను ప్రవేటు వ్యక్తులు అక్రమిస్తుంటే అధికారులు, పాలకులు చోద్యం చూస్తున్నారు. ప్రస్తుత డిగ్రీ కాలేజి ప్రాంతం 40ఏళ్ల క్రితం ఆకులవారి చేరువుగా వుండేది. అప్పట్లో పట్టంలోని శాలివాహనులు కుండలు చేసుకునేందుకు చెర్వులోని మట్టిని వినియోగించేవారు. అప్పటికే డిగ్రీ కాలేజి అద్దె భవనాల్లో నడుస్తుండేది. దీనిని గమనించిన అప్పటి ఎమ్మెల్యే గంగినేని వెంకటేశ్వరరావు పట్టణంలో డిగ్రీకాలేజీకి పరభుత్వ భవనాన్ని నిర్మించాలని తలచి అనుమతులు, గ్రాంట్లు తీసుకువచ్చారు. స్థలం కోసం చూస్తున్న సమయంలో ఆకులవారి చెరువు స్థలం కళాశాలకు ఉపయోగపడుతుందని భావించారు. దీంతో శాలివాహనుల పెద్దలతో సంప్రదింపులు జరిపి చెరువును కళాశాల నిర్మాణం కోసం తీసుకోవడం జరిగింది. దాదాపు 38 ఎకరాలు ఉన్నచెరువును కొందరు అక్రమార్కులు కబ్జా చేస్తున్నట్లు విద్యార్థులు ఆందోళన చేపట్టారు. భూములకు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడుకోవాలని కోరుతున్నాము. ఆక్రమణలు జరిగితే రాబోయే రోజుల్లో పట్టణానికి రానున్న కళాశాలలు నిర్మాణానికి, డిగ్రీ కాలేజి అభివృద్ధికి ఇబ్బందులు వచ్చేఅవకాశాలు ఉన్నాయి. అందువల్ల తక్షణమే డిగ్రీ కళాశాల స్థలాన్ని కాపాడేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం పార్టీ పట్టణ కమిటీ డిమాండ్ చేస్తున్నది. లేకుంటే విద్యార్థులు, పట్టణ ప్రజలతో కలిసి ప్రత్యక్ష ఆందోళనకు దిగడంజరుగుతుందని హెచ్చరిస్తున్నాము.

## కృష్ణా జిల్లా గుడివాడలో అక్రమ మట్టి తరలింపు ..అడ్డుకున్న ఆర్ ఐ పై దాడి



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్ 22: గుడివాడ మండలం మోటూరు గ్రామంలో 21,అర్ధరాత్రి సమయంలో అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం అందిన వెంటనే అధికారులు స్పందించి రెవెన్యూ అధికారి ఆర్ ఐ అరవింద్ మోటూరు పంపించడం జరిగింది మోటూరు చేరుకున్న ఆర్ ఐ అక్రమ మైనింగ్ జరిగేచోట కు వెళ్లి మీకు ఎలాంటి అనుమతులు లేవు కదా ఎందుకు తవ్వుతూ మట్టి తరలిస్తున్నారు అని అడిగిన రెవెన్యూ అధికారిపై జెసిబి తో నెట్టి ఆర్ ఐ నూ రౌండప్ చేసి దుర్భాషలాడి ప్రభుత్వ అధికారి అంటే లెక్కలేని తరుణంలో ఆర్ ఐ పై దాడి చేశారు ఈసంగతి తెలుసుకున్న ప్రభుత్వ అధికారులు గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వగా హుటాహుటిన మోటూరు చేరుకున్న పోలీస్ సిబ్బంది ఆర్ ఐ వై దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకొని వాళ్లపై కేసు నమోదు చేసి ప్రభుత్వ అధికారి పై విధులు నిర్వహిస్తూఉండగా దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అలాగే జెసిబి లాను మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేశామని గుడివాడ రూరల్ సిఐ జయకుమార్ తెలిపారు..

## అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన జనసేన పార్టీ నాయకులు



పొన్నూరు ఏప్రిల్22( ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు నియోజవర్గం చేబ్రోలు మండలం సుద్దపల్లి లో షార్ట్ సర్క్యూట్ వలన 3 పూరి ఇళ్లు పూర్తిగా కాలిపోవడం జరిగింది. ఈ విషయం తెలిసి జనసేన పార్టీ నాయకులు అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించేందుకు శుద్ధపల్లి చేరుకున్నారు. రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రీనివాస యాదవ్, గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి నిత్యావసర సరుకులు తో పాటు ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో ఏమైనా సహాయం కావాలన్నా జనసేన పార్టీ అండగా ఉంటుందని బాధితులకు ధైర్యం చెప్పరు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు మండల అధ్యక్షులు రాములు, జిల్లా నాయకులు రామయ్య,నారిశెట్టి క్రిష్ణా, శివరామ క్రిష్ణా, శ్రీహరి,సత్యనారాయణ, గ్రామ అధ్యక్షులు మట్టుపల్లి భాను నాయకులు,వీరమహిళల,జనసైనికులు పాల్గొన్నారు.

## వై. ఎస్. ఆర్ . సున్నా వడ్డీ పథకం మూడో విడత



బాపట్ల జిల్లా ప్రజాపాలన ప్రతినిధి:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు దేవాదాయ శాఖ మాత్యులు అయిన శ్రీ కొట్టు సత్యనారాయణ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన బాపట్ల జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందాల్ ఐపీఎస్ఈ రోజు వై.ఎస్.ఆర్. సున్నా వడ్డీ పథకం మూడో విడత కార్యక్రమమునకు బాపట్లకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు దేవాదాయ శాఖ మాత్యులు అయిన శ్రీ కొట్టు సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ శ్రీ కొనా రఘుపతి, స్థానిక నివాసంలో బాపట్ల జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందాల్ ఐపీఎస్, మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందచేసినారు.

## భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్బిఐ పక్కన చలివేంద్రం ఏర్పాటు..





పాలేరు ఏప్రిల్ 22 ప్రజాపాలన ప్రతినిధి :నేలకొండపల్లి భక్త రామదాసు సర్విన్ సొసైటీ ఆధ్వర్యంలో నేలకొండపల్లి ఎస్బిఐ బ్యాంకు పక్కన చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగినది ఈ చలివేంద్రాన్ని ముఖ్య అతిధిగా ఎస్బిఐ బ్యాంకు మేనేజ్ వెంకటశ్వరావు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి భక్త రామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షులు మలమది లెనిన్, సొసైటీ మాజీ అధ్యక్షులు. నెల్లూరి వీరబాబు, వెల్లంపల్లి శ్రీనవాసరావు, భాస్కర్ రావ్, రామారావు, గణపతి, దుర్గారావు, గెల్లా వెంకట రమణగుప్త, కడియాల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి ఆధారాలతో స్పందిస్తా: జీవితా రాజశేఖర్

హైదరాబాద్: నటి జీవితా రాజశేఖర్‌కు నగరి కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లుగా వార్తలు వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ఒకే ఆస్తిని ఇద్దరికి విక్రయించారని జీవితారాజశేఖర్‌పై జ్యోస్టర్ ఎండీ హేమ ఆరోపించారు. ఈ ఆరోపణలను జీవితా రాజశేఖర్ ఖండించారు. “మాపై కొందరు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. వీటిపై రేపు (ఏప్రిల్ 23) జరగబోయే ‘శేఖర్’ సినిమా విలేఖరుల సమావేశంలో పూర్తి ఆధారాలతో స్పందిస్తా. అప్పటి వరకు ఎటువంటి కథనాలు ప్రసారం చేయవద్దు అని మీడియాకు విజ్ఞప్తి చేస్తున్నాను” అని జీవితా రాజశేఖర్ మీడియాకు ఓ ప్రకటనలో తెలిపారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ ‘ప్రజాపాలన’ జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| టి.రాంబాబు | శేర్లింగంపల్లి | 6301925113 |
| సత్య కిషోర్ | అమీర్‌పేట | 6309723472 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేదు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కోన.నరసింహారావు | మధిర రూరల్ | 9949426541 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 8688810293 |
| సి.మల్లేష్ | ఇబ్రహీపట్నం | 9618028334 |
| సాయికృష్ణ | వైరా | 9951486635 |
| బాబురావు గొండ్ల | తల్లాడ మండలం | 9848236015 |
| డి.ప్రవీణ్ కుమార్ | కొడంగల్ | 9666027635 |
| టి.సురేష్ చారీ | ఆసిఫాబాద్ | 9000983108 |
| డి.భాస్కర్ | బెల్లంపల్లి | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | జన్నారం రూరల్ | 9493314399 |


# పిడిఎస్ బియ్యం బహిరంగ వేలం

**జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్**



వికారాబాద్ బ్యూరో 22 ఏప్రిల్ ప్రజాపాలన : వికారాబాద్ జిల్లాలో తనిఖీ చేసి అక్రమ వ్యాపారం చేస్తున్న వారి నుండి స్వాధీన పరచుకున్న పిడిఎస్ బియ్యంను పౌర సరఫరాల శాఖ ద్వారా బహిరంగ వేలం వేయనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 839.27 క్వింటల్ల పిడిఎస్ బియ్యం జప్తు చేయబడి, మండల స్థాయి స్టాకిస్ట్ పాయింట్ ల వద్ద (వికారాబాద్, కొడంగల్, పరిగి %ఌ% తాండూర్) వద్ద భద్ర పర్చడం జరిగిందని తెలిపారు. బహిరంగ వేలం పాట ద్వారా అమ్మడానికి ఈనెల 28 న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ నందు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ వేలం పాటలో పాల్గొనదల్చుకున్న వారు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ జిరాక్స్ సమర్పించ వలెనని, బహిరంగ వేలం పాటలో ఎక్కువ పాట పాడి అర్హత పొందిన వారికి సరుకును స్వాధీన పరుచుకొనుటకు జిల్లా అదనపు కలెక్టర్ ఉత్తర్వులకు లోబడి ఉందును. ముందు రోజులలో సరుకు పరిశీలించు కోవడానికి వీలు లేదని,బహిరంగ వేలంలో పాల్గొనుటకు లక్ష రూపాయలు ధరావతు (ఈఎండి) ని డిసిఎస్ఒ వికారాబాద్ పేరు మీద సిద్ధపడి హాజరు కావలెనని తెలిపారు. బహిరంగ వేలం ముగిసిన అనంతరం సమర్పించిన డిడి లు రశీదు తీసుకొని ఇవ్వబడునని ప్రకటనలో తెలిపారు.

## మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్



వికారాబాద్ బ్యూరో 22 ఏప్రిల్ ప్రజాపాలన :మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నామని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో జారీ చేయనున్న వివిధ ఉద్యోగ నియామక నోటిఫికేషన్ లలో భాగంగా మైనారిటీ సంక్షేమ శాఖ, వికారాబాద్ జిల్లా వారి ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీ నిరుద్యోగ యువతి యువకులకు 60 రోజులకు సంబంధించి గ్రూప్ – 4 పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వబడునని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిని పేర్కొన్నారు. ఆన్ – లైన్ అడ్మిషన్స్ కొరకు http://docs.google.com/forms/d/1FOZWxLaCOVNhmGQYCg_s798kNU_r SvuW9QGDm GqqzmE/edit లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని పూర్తి వివరాములకు 9912144364 ను సంప్రదించాలని తెలియజేసినారు.

## నూతన మంచినీళ్ల పైప్లైన్ పనులను ప్రారంభించిన మేయర్లు కార్పొరేటర్లు



మేడిపల్లి, ఏప్రిల్ 22 (ప్రజాపాలన ప్రతినిధి) : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 16వ మరియు 26వ డివిజన్ శంకర్ నగర్ కాలనీలో నూతన మంచినీళ్ల పైప్లైన్ పనులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ రావు పాల్గొని స్థానిక కార్పొరేటర్లు పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి, బండి రమ్య సతీష్ గౌడ్ లతో కలిసి పైప్లైన్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాద్గుల చంద్రారెడ్డి, బండి శ్రీరాములు గౌడ్, హెచ్ఎండిఎస్ మేనేజర్ రమ్య ప్రియ, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పుసులూరు విశ్వనాథం ఆశయ లక్ష్యంగా పని చేయాలి: రచ్చ నరసింహారావు..



ఖమ్మం: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల పరిధిలోని చెన్నారం గ్రామ తొలి గ్రామ సర్పంచ్. స్వాతంత్ర సమరయోధులు తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమ నాయకులు పాలేరు సుగర్ ఫ్యాక్టరీ మొట్టమొదటి డైరెక్టర్ గా ఎన్నో పదవులు చేపట్టి పేద ప్రజల శ్రేయసే లక్ష్యంగా పని చేసిన కామ్రేడ్ పుసులూరు విశ్వనాథం 23వ వర్ధంతి సందర్భంగా వారికి పలువురు నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు రచ్చా నరసింహారావు మాట్లాడుతూ కామ్రేడ్ విశ్వనాథం, ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని నైజాం మిలిటరీతో ఎన్నో దెబ్బలు తిని ఎదురుపడిన మహా నాయకుడు అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల పార్టీ కార్యదర్శి కె.వి.రెడ్డి, పగిడి కత్తుల నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు వందనపు నాగేశ్వరరావు, పుసులూరి భాస్కర్ రావు, పుసులూరి నాగేశ్వరరావు, సిపిఎం పార్టీ గ్రామ కార్యదర్శి ఎస్ కె మదర్, బండారుపల్లి వెంకటేశ్వరరావు, పుసులూరి చిన్న బాబు,

# ఈ నెల 25,26 న స్థిరాస్తులను వేలం

**సహకార బ్యాంకు మేనేజర్ సిరికొండ రమేష్**

బెల్లంపల్లి ఏప్రిల్ 22 ప్రజాపాలన ప్రతినిధి: ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లి సహకార బ్యాంకు శాఖలో లోన్ తీసుకుని దీర్ఘకాలికంగా లోన్ చెల్లించకుండా బ్యాంకులో తనకా ఉంచిన స్థిరాస్తులను ఈనెల 25, 26 తేదీలలో బహిరంగ వేలం వేయనున్నట్లు బెల్లంపల్లి శాఖ మేనేజర్ సిరికొండ రమేష్, ఒక ప్రకటనలో తెలిపారు.సదల శశికళ– రాజ్కుమార్ అనే వ్యక్తి బ్యాంకులో అప్పు తీసుకొని చెల్లించకపోవడం వల్ల తనకాగా ఉంచిన రేచినిలో ఉన్న తన స్థిరాస్తిని ఈ నెల 25న స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం వేయడానికి నిర్ణయించామని ఆయన తెలిపారు. అలాగే తాండూరు గ్రామంలో స్థిరాస్తి కలిగిన పోతరాజుల లీలా– మంగమూర్తి అప్పు తీసుకొని చెల్లించకపోవడం వల్ల తాండూరు గ్రామపంచాయతీలో ఈ నెల 26న వారి స్థిర ఆస్తులను వేలం వేయడానికి నిర్ణయించామని, వేలం పాటలో పాల్గొనలనే వారు ముందుగా 5 వేల రూపాయలధరావతు చెల్లించాలని, వేలం పూర్తయిన వెంటనే ధరలో 15 శాతం చెల్లించవలసి ఉంటుందని, ఒకవేళ చెల్లించని ఎడల ధరావతు పూర్తిగా కోల్పోతారని ఆయన తెలిపారు.వేలం నందు వచ్చిన ధరను 15 రోజుల్లోగా చెల్లించి నట్లయితే రిజిస్ట్రేషన్ కోసం కొన్న వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తామని ఆయన తెలిపారు.ఆసక్తి కలవారు ఈనెల 25, 26 తేదీలలో ఆయా గ్రామ పంచాయతీలలో వేలం లో పాల్గొనాలని బ్యాంకు మేనేజర్ తెలిపారు, పూర్తి వివరాల కోసం బ్యాంకు మేనేజర్ ఫోన్ నెంబర్ 8498089894 ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

# మంచినీటి సమస్యలు రాకుండా చర్యలు

**మేయర్ జక్క వెంకట్ రెడ్డి**



మేడిపల్లి, ఏప్రిల్ 22 (ప్రజాపాలన ప్రతినిధి) : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్లో ఎండాకాలంలో మంచినీళ్ళు సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మేయర్ జక్క వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ సాయిఐశ్వర్య కాలనీ రోడ్ నెం. 16లో 20 లక్షల లీటర్ల మిషన్ భగీరథ రిజర్వాయర్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ బైటింటి శారద ఈశ్వర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్ లతో కలిసి మేయర్ వెంకట్ రెడ్డి భూమి పూజా చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి. రామకృష్ణ రావు, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాద్గుల చంద్రారెడ్డి, హెచ్ఎండిఎస్ మేనేజర్ రమ్య ప్రియ, టిఆర్ఎస్ నాయకుల్ను, కార్యకర్తల్ను, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై డివిజన్లో పర్యటించిన కార్పొరేటర్ చేతన హరిష్



మేడిపల్లి, ఏప్రిల్ 22 (ప్రజాపాలన ప్రతినిధి) :హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరెణి చేతన హరిష్ డివిజన్లో ప్రజా సమస్యలపై పర్యటించారు. ఈమేరకు డివిజన్లోని కాకతీయనగర్, పియన్ టి కాలని, హరిజన బస్తిలలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాకతీయ నగర్లో వరదనీటి కాలువలు నిర్మాణం జరిగాయి, కాని కొన్ని చోట్ల కరెంట్ ట్రాన్స్ఫార్మర్లు కాలవలకు అడ్డుగా ఉన్నాయని వాటిని పక్కకు జరిపించాలని కార్పొరేటర్ విద్యుత్ ఏఈ రాంరెడ్డికి తెలిపారు. అదేవిధంగా గత ఆరు నెలలుగా కాలనీలో నెలకొన్న విద్యుత్ పెండింగ్ పనులను పూర్తిచేయాలని కోరారు. అనంతరం కాకతీయ పార్క్ వద్ద జరుగుతున్న నాలా పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ కీర్తి, బిజెపి సీనియర్ నాయకులు సంజయ్ పటేల్, బోమ్మగోని రఘపతి గౌడ్, చెల్లోజు ఎల్లాచారి, గ్యార రవీందర్,అల్కాపురి సురేష్, కట్ట భాస్కర్, ముశిగంపల శివ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చూసి ఓర్వలేక ఆరోపణలు: లింగాల రవి కుమార్



మధిర ఏప్రిల్ 22ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు విలేకర్ల సమావేశంలో రవాణా శాఖ మాత్యులు పువ్వాడ అజయ్ కుమార్ పై బిజెపి కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలని టిఆర్ఎస్ పార్టీ నేత లింగాల రవి కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మధిరలో విలేకరులతో మాట్లాడారు. పువ్వాడ అజయ్ కుమార్ వ్యక్తిగతంగా ఎవరిపైన వేధింపులకు పాల్పడలేదని ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధే లక్ష్యంగా కెసిఆర్ కేటీఆర్ సహాయంతో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని ఆయన తెలిపారు పువ్వాడ చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేని కొందరు పనిగట్టుకొని విమర్శిస్తున్నారని, కాంగ్రెస్ బీజేపీ చేసే ఆరోపణలు జిల్లా ప్రజలు నమ్మరని లింగాల రవి కుమార్ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు పువ్వాడ కు అండగా ఉన్నారని తెలిపారు.

## 2022-23 ఆర్థిక సంవత్సర ఇంటి పన్ను చెల్లింపుదారులకు ఎర్లీ బర్డ్ ఆఫర్ 5% రాయితీ ఉపయోగించుకోండి: కమిషనర్ రమాదేవి



మధిర ఏప్రిల్22 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు మున్సిపాలిటీ కమిషనర్ రమాదేవి ఈ సంవత్సరం ఇంటి పన్ను చెల్లింపుల్లో పట్టణ ఇంటి పన్ను చెల్లింపుదారులకు తెలియజేయునది ఏమనగా 2022–23 ఆర్థిక సంవత్సరమునకు సంబందించిన ఇంటి పన్ను ఈ నెల చివరి లోపు చెల్లించిన వారికి ఎర్లీ బర్డ్ ఆఫర్ క్రింద 5% రాయితీ వస్తుంది, కావున ఇంటి పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోగలరు. అలాగే పంపు బిల్లు మరియు ఇంటిపన్ను బకాయి చెల్లింపుదారులు వెంటనే ఆన్లైన్, మునిసిపల్ కార్యాలయం, మీ–సేవ లేదా మీ యొక్క వార్డు బిల్ కలెక్టర్కు చెల్లించవలెను లేనియెడల చట్టప్రకారం పంపు కనెక్షన్లు తొలగించబడును, ఆస్తులు జప్తు చేయబడును. పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించగలరు.మిషనర్ మున్సిపాలిటీ తెలిపారు.

## దానవాయిగూడెం 59 వ డివిజన్లొ మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి విస్తృత పర్యటన



ఖమ్మం: ఖమ్మం రూరల్ మండలం దానవాయి గూడెం లో శుక్రవారం ఖమ్మం నగర కమిషనర్ ఆదర్శ్ సురభి పర్యటించి డివిజన్ లొ జరుగుతున్న అభివృద్ధి మరియు పారిశుధ్య పనులను గురించి కార్పోరేటర్ లిశ్రీమతి బట్టపోతుల లలితారాణి జార్జి, ని అడిగి తెలుసుకున్నారు.అనంతరం అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, జ్యోతి, మరియు బట్టాపోతుల సతీష్ గారితో కలిసి డివిజన్ లో పర్యటిస్తు డివిజన్ యేక్క అసౌకర్యాలు, మరియు సమస్యలు, కావల్సిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు.అలాగే డివిజన్ ప్రజలను కుడ వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని హమీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నల్లూరి మధు బాబు గారు కార్యదర్శి గంగి సర్వ కొండలు మరియుతెరాస కార్యకర్తలు కోలా సత్యనారాయణ, గద్దం భాను,తదితరులు పాల్గొన్నారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎస్.రాములు

## ఆశ

మా తోటి వాళ్లలో కొందరికి 1968లో బ్యాంకులో ఉద్యోగాలు వచ్చాయి. కొందరికి పోచంపాడు ప్రాజెక్టు కార్యాలయంలో ఉద్యోగాలు వచ్చాయి. కొందరికి పోస్టాఫీసులో ఉద్యోగాలు వచ్చాయి. ఏ ఉద్యోగం రాక నేను కొంత సమయం బీడీలు చేస్తూ, కొంతసమయం లైబ్రరీలకు వెళ్ళి, మరికొంతసమయం ఆర్.ఎస్.ఎస్. శాఖను నడిపిస్తూ ఉద్యోగం కోసం ఎదురు చూపులు చూశాను.

కానీ చిన్ననాటి స్నేహితుడు మ్యానపురి రాజనర్సయ్యకు ఉద్యోగం రాలేదు. వాళ్ళ నాన్న మ్యానపురి రాజబోసు భుజాన వేసుకొని బట్టలు అమ్మేవాడు. అది కాస్త చిన్న బట్టల షాపు పెట్టించేవరకు వెళ్ళింది. అలా రాజనర్సయ్య బట్టల షాపుకే పరిమితమయినాడు.

మరో బాల్యస్నేహితుడు బీడీ కార్మిక నాయకురాలు కొక్కుల బుచ్చక్క కొడుకు కొక్కుల మారుతి కూడా 1967-68 మధ్య కొంతకాలం బీడీలు చేసి, కొంతకాలం మెట్‌పల్లిలోని పెట్రోలు పంపులో పని చేశాడు. జగిత్యాల పెట్రోలు పంపులో గోవిందుపల్లి లింగారెడ్డి, వాసం గంగారం పనిచేశారు. పాత బస్టాండులో బస్టాండు వుండేది. కొత్త బస్టాండు అప్పుడప్పుడే రూపుదిద్దు కుంటున్నది.

జగిత్యాల క్లబ్ కాంప్లెక్స్‌లో జిల్లా శాఖా గ్రంథాలయం నడిచేది. స్నేహితులం కలుసుకోవడానికి అదొక కేంద్రం. పోచమ్మవాడలో శ్రీకోట శ్రీరంగం ఇంట్లో, వారి పక్కఇంట్లో కిరాయి తురగ రాజిరెడ్డి, దామోదర్‌రెడ్డి, స్వామిరెడ్డి తదితర మిత్రులను కలుసుకునే క్రమంలో శ్రీకోట శ్రీరంగం మంచి స్నేహితుడయ్యాడు. సాహిత్యంపై ఇద్దరికీ అభిరుచి ఉండడంతో జంటకవులుగా వుండాలని నిర్ణయించుకున్నాం. అనేక గేయకథలు, నవలలు, పత్రికలకు చిన్న చిన్న రచనలు ఇద్దరి పేరుపై పంపేవాళ్లం. శ్రీకోట శ్రీరంగం పేరును జూనియర్ శ్రీశ్రీ అని కూడా రాస్తుండేవాడు.

ఆ కాలంలో 'యువ', 'జ్యోతి', 'జయశ్రీ' అనే మాసపత్రికలు కథలు, నవలలతో వెలువడుతుండేవి. రావిశాస్త్రి ఆ పత్రికల ద్వారా పరిచయమయ్యాడు. తరుణి, స్వాతి, మాస పత్రికలతో పాటు తెన్నేటి హేమలత తన పేరుతో 'లత' అనే పత్రిక తీస్తుండేది. డిటెక్టివ్ నవలలు రాసే రచయితలు తాము కూడా పత్రికా రంగానికి మరిలారు. విశ్వప్రసాద్, విజయబాపినీడు వంటివారు కాస్త శృంగారం రంగరించిన పత్రికలు తీశారు. డిటెక్టివ్ రచనలకోసం అప్పుడప్పుడే 'అపరాధ పరిశోధన' అనే పత్రిక కూడా ప్రారంభమైంది. మల్లాది వెంకటకృష్ణమూర్తి, సత్యానంద్ వంటివారు అప్పుడే రచనలు ప్రారంభించారు. మేము ఏవి పంపినా అచ్చుకాలేదు. తెలంగాణ వాళ్ల రచనలు అచ్చు వేయరేమో అనుకున్నాము. ఆడవారి పేర్లమీద ఉంటేనే అచ్చు వేస్తారని అనుకున్నాము. ఆంధ్రప్రభ వీక్లీలో ప్రమదావనం శీర్షికతో మాలతీ చందూర్ ఇచ్చే జవాబులు ప్రపంచ జ్ఞానమంతా ఆమెలోనే ఉంది అన్నట్టుగా ఆకర్షణీయంగా ఉండేవి. ఆంధ్రజ్యోతి వీక్లీ కూడా అప్పుడప్పుడే ప్రారంభమైంది. వీక్లీలలో కథలకు, నవలలకు బహుమతులు ప్రకటించేవారు.

1969 'జై తెలంగాణ' ఉద్యమకాలంలో ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి జగిత్యాలకు వచ్చినప్పుడు అంగట్లో సభలో మాట్లాడుతూ ఒక గమ్మత్తైన తర్కం వినిపించాడు. కొన్ని విషయాలు ప్రజలు అందరూ అంగీకరించినా, ప్రభుత్వం చేయజాలదు. ఉదాహరణకు పన్నులు రద్దు కావాలా అని అడిగితే అందరూ అవునంటారు. కానీ పన్ను రద్దు చేయడం సాధ్యం కాదు. అలాగే ప్రజలందరు తెలంగాణ రాష్ట్రం కావాలని కోరినా, ఏర్పాటు చేయడం సాధ్యం కాదు అని ప్రసంగించడం ఇప్పటికీ గుర్తుండిపోయిన డైలాగు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ, టి.ఎన్. సదాలక్ష్మి, జె. ఈశ్వరీబాయి తెలంగాణ రాష్ట్ర సాధనకోసం తమ శాసనసభ్యత్వాలకు రాజీనామా చేసి ఉద్యమాన్ని ఉదృతం చేశారు. ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి ఎక్కడికెక్కడ ఉద్యమాలపై కాల్పులు జరిపించాడు. ఎందరో చనిపోయారు. మరెందరో గాయపడ్డారు. 371 మంది చనిపోయారని ఆ తర్వాత లెక్క తేలింది. కేశవరావు జాదవ్ వంటివాళ్లు విద్యావంతులకు, విద్యార్థులకు నాయకత్వం అందించారు.

(మిగతాభాగం రేపటి సంచికలో..)

## ప్రముఖ న్యాయవాది సుబ్రహ్మణ్యం పుట్టినరోజు వేడుకలు





మధిర ఏప్రిల్ 22 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు ప్రముఖ సీనియర్ న్యాయవాది కేంద్ర ప్రభుత్వ అదనపు మాజీ బార్ అధ్యక్షులు దేవర పల్లి సుబ్రమణ్యం పుట్టినరోజు సందర్భంగా మానసిక వికలాంగుల స్కూల్ లో అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన ప్రముఖ సీనియర్ న్యాయవాది సుంకు మోహన్ దాస్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదిగా ప్రజల మనిషిగా ప్రజలకు సేవ చేసే కార్యక్రమంలో పలువురు సూచనలు సూచనలు ఇస్తూ అందరూ అభిమానిగా ప్రజలు ప్రజాప్రతినిధులతోఉన్న వ్యక్తిని ఆయన పుట్టినరోజు వేడుకలు ఈ సేవా సదనం లో చేసుకోవడం శుభ పరిణామమని అందరి దీవెనలతో అందరి ఆశీస్సులతో ఇలాంటి పుట్టినరోజులు వేడుక మరెన్నో జరగాలని తెలిపారు అదేవిధంగా కాపు బిడ్డ న్యాయవాదిగా సేవలందిస్తున్న కాపు బిడ్డ సుబ్రమణ్యం శుభాకాంక్షలు అభినందనలు తెలిపిన పలువురు ప్రముఖులు రాజకీయ నాయకులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బార్ అసోసియేషన్ తరపున శుభాకాంక్షలు తెలిపారు ప్రముఖ అదేవిధంగా మెయిన్ రోడ్ వినాయకుడి గుడి దగ్గర అన్నదాన కార్యక్రమం పాల్గొన్న లాయర్ పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపిణి పుట్టినరోజు రోజున అన్నదానం చేయటం శుభ పరిణామమని తెలిపారు ఈ కార్యక్రమంన్యాయవాది అధ్యక్షులు పుల్లారావు జూనియర్ జింకల రమేష్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు వాసిరెడ్డి రామనాథం మండల కాంగ్రెస్ అధ్యక్షులు కిషోర్ చిరు వ్యాపార సంఘ అధ్యక్షులు స్నేహ అండ్ ప్రజాపాలన విలేఖరి పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు మున్నూరు కాపు నియోజకవర్గ ఇంచార్జ్ఆలకృష్ణ కృష్ణ ప్రసాద్ శ్రీనివాస్ ఎస్ ఎస్ ఆర్ పలువురు ప్రముఖులు రాజకీయ నాయకులు అభినందనలు తెలిపారు.

## ఉద్యోగమే లక్ష్యంగా చదవాలి: రేనికుంట్ల ప్రవీణ్



బెల్లంపల్లి , ఏప్రిల్ 22 , ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్ లలో భాగంగా, నిరుద్యోగ యువతీ, యువకులు, గ్రంథాలయాలు కల్పిస్తున్న, సదుపాయాలను ఉపయోగించ కొని ఉద్యోగమే, లక్ష్యంగా, చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని, మంచిర్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ సూచించారు. శుక్రవారం నాడు బెల్లంపల్లి శాఖ గ్రంథాలయంలో, స్థానిక దాతలు తోడే బాబురెడ్డి జ్ఞాపకార్థం, వారి కుటుంబ సభ్యులు,తోడే పద్మా రెడ్డి, తోడే కృష్ణారెడ్డి, (యు ఎస్ ఏ) వంశీ కృష్ణ రెడ్డి లు, 60 వేల రూపాయల విలువచేసే పుస్తకాలను అందించిన సందర్భంగా, గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో హాజరై మాట్లాడారు. బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులు శిక్షణ కోసం ఈనెల 13న ఏర్పాటు చేసిన రాత పరీక్షకు 440 మంది హాజరు కాగా 214 మందిని ఎంపిక చేశామని, మొదటి ర్యాంకు 83 మార్కులతో దాసరి నారాయణ, రెండవ ర్యాంకు రామ్ కి ఆంజనేయులు 83 మార్కులు సాధించారని, ఎంపికైన వారందరికీ, మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తూ, కొద్దిరోజుల్లోనే శిక్షణా కార్యక్రమం, మొదలు పెడతామని, వాటికి సంబంధించిన సదుపాయాలను పూర్తి చేస్తున్నామని ఆయన అన్నారు.ప్రభుత్వం కల్పించే వసతులతో పాటు, స్థానిక స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి 200 పైగా కుర్చీలను, ఫ్యాన్ లను, దాతలు సమకూర్చడానికి ముందుకు రావాలని ఆయన అన్నారు. అనంతరం వంశీకృష్ణ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ, యువతీ, యువకులు శిక్షణ కోసం వస్తున్న సందర్భంగా వారికి ఉపయోగపడే విధంగా అన్ని సబ్జెక్టులపై పుస్తకాలను అందిస్తున్నామని, ప్రతి ఒక్కరు పుస్తకాల్ని ఉపయోగించుకొని బాగా చదువుకొని జిల్లాలోనే, బెల్లంపల్లి గ్రంథాలయం నుండి అత్యధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని, అప్పుడే మా నాన్న గారి ఆత్మకు శాంతి కలుగు తుందని ఉన్నారు, అవసరమైతే అత్యవసరం అనుకున్న పుస్తకాలను మరిన్ని అందించడానికి కూడా వెనుకాడేది లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెరాస నాయకులు అలవేన సంపత్, సోకాల శ్రీనివాస్, స్టూడియో రమేష్, బోల్ల బత్తుల మల్లేష్, డి. రాము, లైబ్రేరియన్ గోపి, సిబ్బంది శ్రీనివాస్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో పిల్లలకు సంబంధించిన మెటీరియల్ వితరణ



మధిర ఏప్రిల్ 22 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు టీవీ ఎం సిపిఎస్ స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లో దాత, విద్యాభిమాని, శ్రీ పుల్లఖండం చంద్రశేఖర్, గత 15 సంవత్సరాల నుండి పిల్లలకు కావాల్సిన మెటీరియల్ దాతల సహకారంతో ఇస్తున్నట్లు రిటైర్డ్ ఎండిఓ నాగేశ్వరావు తెలిపారు బాలికల పాఠశాల, టి.వి.ఎమ్.పాఠశాల, సి.పి.యెస్.హైస్కూల్ లలో యెస్.యెస్.సి. చదువుతున్న సుమారు 150 మంది విద్యార్థులు అందరికీ, పరీక్ష దాతల సహకారంతో అట్టలు, పెన్, పెన్సిల్, ఎరేసర్, స్కేల్, హాల్ టికెట్ కొరకు పోచ్, స్టార్ చాక్లెట్ ఉచితంగా అందచేసిన సందర్భంగా, విద్యార్థులకు పై సందేశమిచ్చారు, దాత చంద్రశేఖర్ పలువురు అభినందనలు ఇలాంటి కార్యక్రమాలు చేయాలని . పిల్లల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎమ్.డి.ఓ. మాధవరపు నాగేశ్వరరావు, సదరు పాఠశాలల ఉపాధ్యాయ వర్గం పాల్గొని, చంద్రశేఖర్ సేవలను ప్రశంసించారు.

## పుట్టినరోజు సందర్భంగా పలువురు శుభాకాంక్షలు



మధిర ఏప్రిల్ 22 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు పలువురు ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రముఖ న్యాయవాది కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది మధిర బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ శ్రీదేవరపల్లిసుబ్రహ్మణ్యం ని శాలువా తో బుకే తో పలువురు ప్రముఖులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు అఖిలపక్ష నాయకులు రెండో వార్డు కౌన్సులల్ సయ్యద్ ఇక్బల్ మంచాల నాగబాబు లాయర్ జింకల రమేష్ పాల్గొన్నారు.

# మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన బిజెపి నాయకులు



బెల్లంపల్లి , ఏప్రిల్ 22, ప్రజాపాలన ప్రతినిధి: ప్రధాని మోడీ, బండి సంజయ్, బీజేపీ నాయకులపై బుధవారం వరంగల్ సభలో ఐ.టి శాఖ మంత్రి కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తాండూర్ మండలం కేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం బీజేపీ నాయకులు కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు రామగోని మహీధర్ గౌడ్ మాట్లాడుతూ టిఆర్ఎస్ వరుస ఓటములతో ఫ్రస్టేషన్లో ఉన్న కేటీఆర్, తాను మంత్రి అనే సోయి తప్పి, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి బీజేపీ నాయకులపై అవాకులు, చెవాకులు, పేలుతూ వీధి రౌడీలా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. బీజేపీ నాయకులపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు, తక్షణమే వెనక్కు తీసుకుని, క్షేమాపన చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల తెలంగాణలో కేటీఆర్ ను తిరగనీయబోమని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు విజయ్,ప్రధాన కార్యదర్శులు విష్ణుకళ్యాణ్, భరత్, భాస్కర్ గౌడ్, జిల్లా నాయకులు శేషగిరి, సుధీర్ గౌడ్,చిరంజీవి, రాహుల్, శ్రీనివాస్,ఆనంద్,మల్లేష్, బానేష్, సోమయ్య, సాయి కిరణ్, సంతోష్, పెంటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాబ్ల సేవలు అభినందనీయం: కలెక్టర్ గౌతమ్



మధిరఏప్రిల్ 22 ప్రజా పాలన ప్రతినిధి :మున్సిపాల్టీ పరిధిలో గురువారం నాడు జరిగిన ఆరోగ్య మేళ సందర్భంగాపట్టణంలోని బంజారా కాలనీకి చెందిన మధిర లిసాంస్కృతిక రథసారధి, రామభక్త సీతయ్య కళాపరిషత్ నిర్వాహకులు శ్రీ ఆర్ బాబ్లలి ను గురువారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంల ద్వారా ఏర్పాటు చేసిన మధిర గవర్నమెంట్ ప్రభుత్వ హాస్పిటల్ నందు జరిగిన మెగాహెల్త్ క్యాంపుకు వచ్చిన ప్రతి పేషెంట్ కు ప్లాస్టిక్ నిరోధించాలి అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరికి జూట్ క్లాత్ బ్యాగ్ లు సంచులు పంచి పెట్టినారు. ముందుగా కలెక్టర్ గౌతమ్ చేతులు మీదుగా జూట్ బ్యాగ్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబ్ల చేస్తున్న సాంస్కృతిక, సామాజిక సేవలు గురించి వివరించగా ఇలాంటి సేవలు ప్రతి ఒక్కరు చేయాలి అని ఈ సేవలు చేస్తున్న బాబ్లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరియు ఇతర వైద్యశాఖ సిబ్బంది, డాక్టర్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దాదా పుగా 240 జూట్ బ్యాగ్స్ పంపిణీ చేయడం జరిగింది.

## రూ 40 లక్షలతో సీసీ రోడ్డు డ్రైనేజీ పనులు ప్రారంభించిన మేయర్ బుచ్చిరెడ్డి



మేడిపల్లి, ఏప్రిల్ 22 (ప్రజాపాలన ప్రతినిధి):బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్ ఇందిరా నగర్లో స్థానిక కార్పొరేటర్ జక్కల పద్మ రాములు, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవి గౌడ్ లతో కలిసి మేయర్ సామల బుచ్చిరెడ్డి రూ 40 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు జక్కల రాములు ,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేతకాని నిరుద్యోగ యువకుల అభివృద్ధి పట్ల చొరవచూపాలి

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు వినతిపత్రం అందజేసిన సాయిని ప్రసాద్ నేత**



మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 22, ప్రజాపాలన: రాష్ట్రంలోని నేతకాని నిరుద్యోగ యువతీ , యువకుల అభివృద్ధి పట్ల చొరవచూపాలని కోరుతూ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో వినతిపత్రం అందజేశారు నేతకాని విద్యార్థి సంఘం - రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత . శుక్రవారం ఆయన నివాసంలో మంత్రి ని మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నేతకానీ విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని చదువులో, ఉద్యోగ అవకాశాల్లో వెనకబడి ఉన్న నేపథ్యంలో దళిత బందు పథకంలో ప్రాదాన్యత కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి నేతకాని సమాజం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉన్నామని రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించను న్నట్లు వాటిలో భాగస్వామ్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమెర రామకృష్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి దుర్గం వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ రవి నాయక్ ను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**తెలంగాణ రాష్ట్ర, మున్సిపల్ కౌన్సిల్ ఫోరం, రాష్ట్ర చైర్మన్, రాము నాయక్**



బెల్లంపల్లి ఏప్రిల్ 22 ప్రజా పాలన ప్రతినిధి: మహబూబాబాద్ ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్, రవి నాయక్ ను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ రాము నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఒక ప్రజా ప్రతినిధి అయిన కౌన్సిలర్ను హత్య చేయడం దారుణమైన చర్య అని, ఏవైనా లావాదేవీలు ఉంటే పరిష్కరించుకోవాలి తప్ప, ప్రాణాలు తీయడం సరైంది కాదని అన్నారు. ఇలాంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధుల కోసం. ప్రత్యేకంగా రక్షణ భద్రత చట్టం తీసుకోవచ్చి ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాలని , రాష్ట్ర ముఖ్యమంత్రి కి మున్సిపల్ కౌన్సిల్ ఫోరం తరపున విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన తెలిపారు.

## అర్జున్ రెడ్డి దర్శకుడి 'యానిమల్' షూటింగ్ షురూ..!




దర్శకుడు సందీప్ రెడ్డి వంగా గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. 'అర్జున్ రెడ్డి' సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసి.. ఒక్క సినిమాతోనే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిపోయాడు. అదే చిత్రాన్ని 'కబీర్ సింగ్' పేరుతో హిందీలో రీమేక్ చేసి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు.దీంతో సౌత్ లోనే కాకుండా బాలీవుడ్ లోనూ క్రేజీ డైరెక్టర్ గా మారిపోయాడు. ఈ నేపథ్యంలో కాస్త గ్యాప్ తీసుకున్న సందీప్ వంగా.. తొలిసారిగా బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ తో కలిసి "యానిమల్" అనే భారీ ప్రాజెక్ట్ చేయడానికి రెడీ అయ్యారు. యాక్షన్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న 'యానిమల్' చిత్రాన్ని గతేడాది ప్రారంభంలోనే ప్రకటించారు. అయితే రణబీర్ ఇతర కమిట్ మెంట్స్ వల్ల ఆలస్యమవుతూ వచ్చింది. అయితే ఇవాళ శుక్రవారం ఈ సినిమాని పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. 'యానిమల్' మూవీ రెగ్యులర్ షూటింగ్ ను కూడా ఈరోజు హిమాలయాల్లోని మనాలిలో మొదలుపెట్టినట్లు చిత్ర బృందం తెలిపింది. టైటిల్ కు తగ్గట్టుగానే ఈ సినిమాలో హీరో పాత్ర చాలా స్ట్రాంగ్ గా పవర్ ఫుల్ గా ఉంటుందని తెలుస్తోంది.అంతేకాదు ఇందులో రణబీర్ కపూర్ ని పూర్తిగా భిన్నమైన పాత్రలో చూపించనున్నారు. దీని కోసం రణబీర్ మేకోవర్ అవుతున్నారు. రణబీర్ - సందీప్ వంగాల క్రేజీ కాంబినేషన్ లో రాబోతున్న ఈ ప్రాజెక్ట్ పై ఇప్పటికే తగినంత బజ్ క్రియేట్ అయింది.'యానిమల్' ఒక పాన్ ఇండియా ప్రాజెక్ట్. ఇది అన్ని దక్షిణ భారత భాషలు మరియు హిందీలో విడుదల చేయబడుతుంది. ఈ సినిమాలో కొంతమంది ప్రముఖ నటీనటులు - అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు భాగం అవుతున్నారు.రణబీర్ కపూర్ సరసన రష్మిక మందన్నా హీరోయిన్ గా నటించనుంది. బాబీ డియోల్ - అనీల్ కపూర్ వంటి బాలీవుడ్ స్టార్స్ కీలక పాత్రలు పోషించనున్నారు. గుల్షన్ కుమార్ సమర్పణలో టీ సిరీస్ - భద్రకాళి పిక్చర్స్ బ్యానర్స్ పై ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.భూషణ్ కుమార్ - ప్రణయ్ రెడ్డి వంగా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి శాంతా సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. 'యానిమల్' మూవీని 2023 ఇండిపెండెన్స్ డే వీక్ లో ఆగస్ట్ 11న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

## విష్ణు "భళా తందనానా" రిలీజ్ డేట్ ఫిక్స్




యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు తన రాబోయే చిత్రం భళా తందనానాతో ప్రేక్షకులను అలరించబోతున్నాడు. బాణం మరియు బసంతి ఫేమ్ చైతన్య దంతులూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కేథరిన్ థ్రెసా హీరోయిన్ గా నటిస్తుంది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30, 2022న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు ప్రకటించారు. అదే విషయాన్ని తెలియజేసేందుకు సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. రిలీజ్ డేట్ ఇంతవరకూ రానందున ప్రమోషన్స్‌ని వేగవంతం చేయాల్సింది టీమ్ భళా తందానా. కేజీఎఫ్ ఫేమ్ రామచంద్రరాజు ఈ సినిమాలో విలన్‌గా నటించారు. వారాహి చలనచిత్రం పతాకంపై రజనీ కొర్రపాటి నిర్మించిన ఈ చిత్రంలో సత్య, శ్రీనివాస్ రెడ్డి, పోసాని కృష్ణ మురళి, ఆదర్శ్ బాలకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందించారు.

## ఇలా కూడా ప్రమోట్ చేస్తారా విజయ్ భయ్యా!



సాధారణంగా ఒక హీరో హ్యాండ్సమ్ గా ఉండటం వల్లనో .. అతని యాక్టింగ్ స్టైల్ నచ్చడం వల్లనో చాలామంది అభిమానులుగా మారిపోతుంటారు. ఈ రెండింటితో పాటు యాటిట్యూడ్ ద్వారా కూడా అభిమానులను సంపాదించుకోవచ్చనీ .. అవకాశాలను దక్కించుకోవచ్చని విజయ్ దేవరకొండ నిరూపించాడు. ప్రేక్షకులు ఆయన యాటిట్యూడ్ కి మొదటి ప్రాధాన్యతను ఇవ్వడం వలన అప్పుడప్పుడు పలకరించే ఫ్లాపులు ఆయనను ఏమీ చేయలేకపోతున్నాయి. బడా నిర్మాణ సంస్థలు ఆయనతో పాన్ ఇండియా సినిమాలు చేయడానికి ఉత్సాహాన్ని చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండ .. శివ నిర్వాణ దర్శకత్వంలో ఒక ప్రాజెక్టును పట్టాలెక్కించాడు. మైత్రీ మూవీ మేకర్స్ వారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కథానాయికగా సమంత కనిపించనుంది. ఇతర ముఖ్య పాత్రల్లో వెన్నెల కిశోర్ .. రాహుల్ రామకృష్ణ కనిపించనున్నారు. హరీశ్ శంకర్ ముఖ్య అతిథిగా నిన్ననే ఈ సినిమా పూజా కార్యక్రమాలు జరుపుకుంది. సినిమాను లాంచ్ చేసే కార్యక్రమానికి హీరోయిన్లు తప్పకుండా హాజరవుతూ ఉంటారు. కానీ ఈ పూజా కార్యక్రమాలకి సమంత రాలేదు. వెన్నెల కిశోర్ .. రాహుల్ రామకృష్ణ కూడా హాజరు కాలేదు. ఈ పూజా కార్యక్రమానికి సంబంధించిన ఫొటో బయటికి రావడంతో సమంత ఎందుకు రాలేదు? అనే ప్రశ్న సోషల్ మీడియాలో పెరుగుతూ పోతోంది. దాంతో సరదాగా విజయ్ దేవరకొండ ఒక పని చేశాడు. ఈ పూజా కార్యక్రమాలకు సమంతతో పాటు వెన్నెల కిశోర్ .. రాహుల్ రామకృష్ణ కూడా వచ్చినట్టుగా ముందుగా వదిలిన ఫోటోకి వాళ్ల ఇమేజ్ లను యాడ్ చేసి వదిలాడు. ఇదే అసలైన ఫొటో అనీ .. ప్రెస్ మీడియా వారు ఈ ఫొటోను షేర్ చేయాలని రిక్వెస్ట్ చేశాడు. దాంతో ఇప్పుడు ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. విజయ్ దేవరకొండ ఇలాంటి సరదా పనులే ఎక్కువగా చేస్తూ ఉంటాడని కొంతమంది నవ్వుకుంటూ ఉంటే ఈ కార్యక్రమానికి హాజరు కాని కారణంగా సమంతను టీజ్ చేయడంలో భాగంగానే ఆయన ఇలా చేశాడని మరికొందరు అంటున్నారు. ఇంకొందరు మాత్రం 'ఇలా కూడా ప్రమోట్ చేస్తారా విజయ్?' అని అడిగేస్తున్నారు. విజయ్ ఉద్దేశమేదైనా ఈ ఫొటోలో సమంత .. వెన్నెల కిశోర్ నిజంగానే హాజరైనట్టుగా ఆ ప్లేసులలో సెట్ అయ్యారు. రాహుల్ రామకృష్ణ ఇమేజ్ ఒక్కటే కాస్త తేడా కొట్టేసిందంతే. విజయ్ చేసిన ఈ పనికి సమంత .. వెన్నెల కిశోర్ ఫన్నీగా స్పందించారు. సమంత దుబాయ్ లో ఉండటం వలన రాలేకపోయిందని తెలుస్తోంది.

## సెన్సార్ పూర్తి చేసుకున్న 'ఆచార్య'




మెగాస్టార్ చిరంజీవి - మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం "ఆచార్య". కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ విడుదలకు సిద్ధమైంది. తండ్రీకొడుకులు కలిసి నటించిన ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ తో పాటుగా సాధారణ ప్రేక్షకులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 29న ఈ మూవీ భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది.'ఆచార్య' సినిమాకు సంబంధించిన అన్ని ఫార్మాలిటీస్ పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి 'యూ/ఏ' సర్టిఫికేట్ జారీ చేసినట్లు మేకర్స్ తెలిపారు. అల్టిమేట్ యాక్షన్ చూడటానికి రెడీగా ఉండమని చెబుతూ ఈ మేరకు ఓ స్పెషల్ పోస్టర్ ని రిలీజ్ చేశారు. ఇందులో చిరంజీవి చేతిలో త్రిశూలం పట్టుకుని ఇంటెన్స్ గా నిలబడి ఉన్నారు. ఇదొక ఫైట్ సీక్వెన్స్ లోని స్టిల్ అని అర్థం అవుతుంది. టాలీవుడ్ లో అపజయం ఎరుగని దర్శకుడిగా ఉన్న కొరటాల శివ.. తనదైన శైలి నేపథ్యానికి కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. ఇప్పుడు 'ఆచార్య' సినిమాలో నక్సలిజం బ్యాక్ డ్రాప్ లో ధర్మస్థలి అనే ప్రాంతం చుట్టూ జరిగే కథను చెప్పబోతున్నారు. సినిమా రన్ టైం 154 నిమిషాలు (2 గంటల 34 నిమిషాలు) వచ్చినట్లు తెలుస్తోంది.'ఆచార్య' సినిమాలో చిరంజీవి సరసన కాజల్ అగర్వాల్.. రామ్ చరణ్ కు జోడీగా పూజా హెగ్డే సందడి చేయనున్నారు. సంగీత - రెజీనా స్పెషల్ సాంగ్స్ లో అలరించబోతున్న ఈ సినిమాలో సోనూసూద్ - జిషు సేన్ గుప్తా - వెన్నెల కిశోర్ - పోసాని కృష్ణ మురళి - తనికెళ్ళ భరణి - సౌరవ్ లోకేష్ కీలక పాత్రలు పోషించారు. కొణిదెల ప్రొడక్షన్స్ సురేఖ సమర్పణలో మ్యాట్నీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నిరంజన్ రెడ్డి - అన్వేష్ రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిచారు. మణిశర్మ సంగీతం సమకూర్చారు. తిరునవుక్కరసు సినిమాటోగ్రఫీ అందించగా.. సురేష్ సెల్వరాజన్ ప్రొడక్షన్ డిజైనింగ్ చేశారు. నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటికే 'ఆచార్య' సినిమా నుంచి వచ్చిన టీజర్ - ట్రైలర్ - పాటలు మంచి స్పందన తెచ్చుకున్నాయి. ప్రమోషన్స్ లో భాగంగా రేపు ఏప్రిల్ 23న హైదరాబాద్ లో గ్రాండ్ గా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. భారీ అంచనాల నడుమ వచ్చే వారం థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

## 'ఊ.. ఆ..ఆహా.. ఆహా' సింగిల్ ఊపేయడం పక్కా!




విక్టరీ వెంకటేశ్- మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కాంబినేషన్లో అనీల్ రావిపూడి దర్శకత్వంలో 'ఎఫ్-3' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. 'ఎఫ్ -2'కి సీక్వెల్ గా తెరకెక్కుతోన్న సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్టుక్ పోస్టర్.. తొలి సాంగ్కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ కొద్ది సేపటి క్రితమే మరో లిరికల్ సింగిల్ ని రిలీజ్ చేసారు.'ఊ .. ఆ .. అహ అహ' అంటూ సాగే ఈ పాట ఆద్యంతం శ్రోతల్ని ఆకట్టుకుంది. పాటలో వెంకటేశ్ - తమన్నా.. వరుణ్ తేజ్ - మెహ్రీన్ జంటలతో పాటు సునీల్ కూడా మధ్య మధ్యలో స్టెప్ అందుకున్నారు. దేవి మార్క్ సాంగ్ లా హైలైట్ అవుతుంది. మాస్ ఆడియన్స్ టార్గెట్ గా రూపొందిన సాంగ్ ఆ వర్గం ఆడియన్స్ కి రీచ్ అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.దేవి మాస్ బీట్స్ ఆకట్టుకుంటున్నాయి. తమన్నా పాలనురుగల అందం..మెహ్రీన్ హాట్ అందాలు పాటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాటలో ముద్దుగుమ్మల కాస్ట్యూమ్స్ సమ్ థింగ్ స్పెషల్ గా ఫోకస్ అవుతున్నాయి. చిట్టిపొట్టి నిక్కర్లు.. సారీలో నపడుముము ఒంపుసొంపులు ఒకటేంటి? భామలిద్దరు పాటలో అందాలు విందు వడ్డించినట్లే కనిపిస్తుంది.థియేటర్లో విజిల్స్ వేయించడం ఖాయం. ఈ పాటని ప్రత్యేక సెట్ వేసి చిత్రీకరించినట్లు తెలుస్తోంది. పాట కోసం భారీగానే వెచ్చించినట్లు సెట్ డిజైన్ బట్టి తెలుస్తోంది. 'పుష్ప' లో 'ఊ అంటావా మావ మావ' పాట ఎంత పెద్ద హిట్ అయిందో రిలీజ్ తర్వాత 'ఎఫ్-3' లో సెకెండ్ సింగిల్ అంతే హైలైట్ అవుతుందని ఫీడ్ బ్యాక్ వస్తుంది. అంతకు ముందు నెట్టింట షేక్ చేయడం పక్కా అనే టాక్ వినిపిస్తుంది.సినిమా రిలీజ్ కి ఇంకా వారం రోజులే గడువు ఉంది. దీంతో యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలు షురూ చేసినట్లు తెలుస్తోంది. రిలీజ్ లోపు వీలైనంత బజ్ తీసుకొచ్చి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా రెండవ సింగిల్ ని ముందే రివీల్ చేసారు. ఈ పాట సినిమాకి మంచి హైప్ తీసుకొస్తుంది. ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్.. సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రంలో హీరోయిన్ పూజా హెగ్డే ఐటం పాటలో కనిపించనున్నారు. పూజా కన్నా ముందుగానే తమన్నా.. మెహరీన్ అందాలతో షేక్ చేస్తున్నారు. ఇక ఆ భామ కూడా తోడైతే ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మిస్తుంది.

## శ్రీదేవి శోభన్ బాబు" ట్రైలర్ ను విడుదల చేయనున్న చిరు, చరణ్




చిరంజీవి, రామ్ చరణ్ హీరోలుగా నటిస్తున్న ఆచార్య సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ రేపు హైదరాబాద్‌లో గ్రాండ్‌గా జరగనున్న సంగతి అందరికీ తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 29, 2022న థియేటర్లలో విడుదల కానుంది. లేటెస్ట్ న్యూస్ ఏంటంటే, ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శ్రీదేవి శోభన్ బాబు థియేట్రికల్ ట్రైలర్‌ను చిరు, చరణ్ లాంచ్ చేస్తారని సమాచారం.గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై చిరంజీవి కూతురు సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో సంతోష్ శోభన్ మరియు 96 ఫేమ్ గౌరీ జి కిషన్ ప్రధాన నటులుగా నటించారు. ఈ చిత్రానికి క్రమాన్ సంగీతం అందించారు.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY SNEHA CLUB · SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989